# జనశక్తి

విప్లవ కమ్యూనిస్టుల పక్ష పత్రిక

www.janashaktionline.com

సంపుటి : 44 సంచిక : 20 విజయవాడ 20-2-2012 పేజీలు : 8 వెల: రు 5.00



లోపలి పేజీల్లో...

- ◈ సిరియాపై దురాక్రమణకు సాకులు తయారుచేసుకుంటున్న అమెరికా
- ◈ వివిధ దేశాలలో ప్రజాందోళనలు
- ◈ ఫిబ్రవరి 28–అఖిల భారత హర్తాళ్–ఏఐఎఫ్‌టియు(న్యూ)పిలుపు
- ◈ జైపూర్ సాహిత్య ఉత్సవం–కుహనా లౌకికవాద రాజకీయాలు
- ◈ జూనియర్ డాక్టర్ల సమ్మె–కొన్ని పరిశీలనాంశాలు
- ◈ పశ్చిమబెంగాల్‌లో పెరుగుతున్న రైతాంగ ఆత్మహత్యలు
- ◈ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ నిధిని గుత్తపెట్టుబడి ఖాతాకు తరలింపు చర్యలు


## ప్రజల మూలుగులను పీల్చివేస్తున్న అక్రమార్జనలు

**రాష్ట్రంలో** రసవత్తరమైన దోపిడీవర్గ రాజకీయ నాటకం ప్రదర్శితమౌతున్నది. పాలకవర్గాల రాజకీయ పక్షాలైన కాంగ్రెసు, టి.డి.పి., వై.కా.పా., టిఆర్ఎస్‌లన్నీ తమతమ పాత్రలను పోషిస్తూ నాటకాన్ని రక్తికట్టిస్తున్నాయి. ఈ నాటకంలో నిరంకుశాధికారులు, న్యాయాధిపతులూ, పోలీసులు, పత్రికలు, టివీ ఛానెళ్లు తమతమ పాత్రలను నిర్వహించేందుకు సమయం ఎంచుకుని రంగప్రవేశం చేస్తున్నాయి. రెండు గంటలపాటు తమ జీవన సమస్యలన్నింటినీ మరపించి రంగుల కలల ప్రపంచంలో విహరింపజేసి లాభాలు చేసుకునే సినిమా పరిశ్రమలాగే, పాలకుల విధానాల ఫలితంగా జీవితం కష్టాలమయమవుతున్న వాస్తవాన్ని ప్రజలు గుర్తించకుండా ప్రజాసంక్షేమంకోసమే సాగుతున్న కృషి అన్న భ్రమలో ప్రజలనుంచేందుకు పాలకవర్గాలాడుతున్న ప్రహసనమిది.

పాలకవర్గాలలోని సెక్షన్లు రాజ్యాధికారంలో వాటాకోసం పడిన, పడుతున్న ముఠా తగవులన్నింటినీ ప్రజాసంక్షేమంకోసం సాగుతున్న ప్రజాస్వామిక ప్రక్రియగా చిత్రించే నాటకమిది. జలయజ్ఞం పేరిట కాంగ్రెసులోని ముఠాలన్నింటికీ ఎవరికి తగిన వాటాలు వారికందించి, తస్మదీయులకు కోట్ల రూపాయల ప్రజాధనాన్ని కట్టబెట్టినంతకాలమూ నోరుమెదపని కాంగ్రెసు నాయకులందరూ నేడు రంగం మీదకొచ్చి అవినీతిపై పోరాటయోధుల పాత్రలు ధరించిన నాటకమిది. తాము పొందుతూవచ్చిన వాటాల గురించి చర్చలోకి రాకుండా రాజశేఖరరెడ్డి తన కుటుంబానికి మాత్రమే లబ్ధిచేకూర్చాడని చిత్రించే నాటకమిది. సుప్రింకోర్టు తీర్పును బుట్టదాఖలు చేసి, బాక్సైటు ఖనిజాన్ని రస్‌అల్‌ఖైమాకు కట్టబెట్టి దొడ్డిదారిని చూపిన తన పద్ధతినే అమలుచేసి బాక్సైట్‌తోపాటు, ఇనుప ఖనిజాన్ని, విలువైన ప్రభుత్వ భూములనూ దోపిడీ శక్తులకు కట్టబెట్టి రాత్రికిరాత్రి కోట్లకు పడగలెత్తించిన రాజశేఖరరెడ్డిని "అవినీతి రాజా" అంటున్న తెలుగుదేశం గురివింద గింజ పాత్ర ధరించిన నాటకమిది. గనుల రంగంలో విదేశీ పెట్టుబడులు ప్రవేశించేందుకు గనుల చట్టాన్ని తాను కేంద్రంలో అధికారంలో వుండగా సవరించి ప్రజాసంపదను విదేశీ దోపిడీశక్తుల పాలుచేసే విధానాన్ని ప్రారంభించిన బిజెపి ఈ అక్రమార్జనలన్నీ కాంగ్రెసు పాలన పుణ్యంగానే చిత్రించే నాటకమిది.

అయితే ఈ నాటకం యిక్కడితో ఆగలేదు. 'అక్రమార్జనలన్నీ నా తండ్రి మాత్రమే పొందాడా, దానికి తోడ్పడిన మిగతా మంత్రులందరూ నిర్ణయాలలో భాగస్వాములు కారా' అంటూ వైఎస్ఆర్ తనయుడు జగన్ తన అక్కసునంతా వెళ్లగక్కాడు. అధికార వారసత్వం నెహ్రూ కుటుంబానికేనా, నాకెందుకు వర్తించదన్నదే అతని అక్కసు. సారా వ్యాపారంలో ముడుపుల వ్యవహారం బయటపడేసరికి నాయకులు మరింత హీనస్థాయికి దిగజారారు. కాంగ్రెసు వారికేనా ముడుపులు దక్కింది, మిగిలిన పార్టీలందరికీ దక్కాయంటూ తమ అవినీతిని బయటపెట్టుకుంటున్నామన్న వెరపుకూడా లేకుండా సిగ్గుమాలిన వాదనకు దిగారు. అవినీతి అక్రమార్జనలను వ్యాపారం చేసుకోవటంగా, మా బంధువులు వ్యాపారం చేసుకోకూడదా అంటూ ప్రశ్నిస్తూ, అవినీతి–వ్యాపారం కవలపిల్లలుగా మార్చినంతగా ఊడలు దిగిన అవినీతిని ప్రశ్నించరానిదిగా హెచ్చరిస్తున్నారు. నిర్ణయాలు మీరుచేసి అమలుచేసిన మమ్ములను బలిచేస్తారా, పెద్ద చేపను వదలి చిన్న చేపలను పట్టుకుంటారా అని ప్రజాసంక్షేమమంటే వారిని అణచివేయటమన్న అర్థాన్ని రంగరించి పోసి వలసపాలకుడు పోషించిన నిరంకుశాధికార గణం వాపోయి అవినీతిలో తమపాత్రను కూడా బయటపెట్టుకున్నాయి.

రాజకీయ నేతలు, నిరంకుశాధికార గణాలు అవినీతి, అక్రమార్జనల్లో కూరుకుపోయి, తమ క్రిందిస్థాయిలో అవినీతిపై మౌనం వహిస్తూ న్యాయవ్యవస్థను రంగంలోకి దించి వ్యవస్థీకృత అవినీతిని వ్యక్తిగత అవినీతిగా చిత్రిస్తున్నది. న్యాయాధీశుల అక్రమార్జనలు ఇటీవల కాలంలో వెల్లడైన నేపథ్యంలో, న్యాయవ్యవస్థ చురుకైన పాత్ర పేరిట న్యాయవ్యవస్థ కూడా అధికారాన్ని చెలాయిస్తున్న వారికి వంతపాడుతూ, అవినీతికి అవకాశం కల్పించిన విధానాల జోలికి వెళ్లకుండా వ్యక్తిగత సమస్యగా విచారిస్తున్నది.

'పెట్టుబడికీ కట్టుకథకీ పుట్టిన విషపుత్రికలు' ఈ నాటకాన్ని మరింత రక్తికట్టించే, కోడుగుడ్డు మీద ఈకలు పీకే చర్చలతో తమ పాత్రను పోషిస్తున్నాయి. ఇటీవల సంచలనం గావించబడ్డ రెండు అంశాలు–గనులు,సారా–అంశాలను లోతుగా పరిశీలిస్తే ఈ నాటక కపటత్వం బయటపడుతుంది.

గాలి జనార్దనరెడ్డి ఇనుప ఖనిజాన్ని ఇష్టారాజ్యంగా తవ్వి తరలించినంత కాలమూ ఏ ఒక్కరూ కిక్కురు మనలేదు. ఒక పాతకాలపు గుడిని కూల్చారా లేదా అన్నది చర్చనీయాంశంచేసి పరిశీలనకు వెళ్లిన శాసనసభాసంఘం సభ్యులందరూ సూటుకేసులు పుచ్చుకుని తిరిగివచ్చి (నాగం జనార్ధనరెడ్డి తప్ప) సజావుగానే గనుల తవ్వకం సాగుతున్నదని తేల్చి చెప్పారు. గనుల తవ్వకంలో కర్ణాటకలో డజనుకు పైగా గ్రామాలు నివాసయోగ్యం కాకుండా పోయి గ్రామాలు ఖాళీచేసినా వారి గోడు విన్పించుకోలేదు. ప్రవాహంలా లారీలతో ఇనుప ఖనిజం తరలింపుతో ప్రమాదాలలో వందమందికి పైగా మృతి చెందినా, గాయపడినా, పోలీసులను పంపి లాలించి బెదిరించి పంచాయితీలు చేసి కేసులు కట్టకుండా చేశారుతప్ప సమస్య పరిష్కరించమన్న ప్రజల ఆందోళనను ఎవరూ ఏనాడూ పట్టించుకోలేదు. కానీ వైఎస్ జగన్ ముఖ్యమంత్రి పదవికి పోటీకి దిగగానే పాపాల పుట్ట పగిలింది. ఇన్నాళ్లూ మౌనం పాటించిన వారందరూ అవినీతిపై గళమెత్తారు. అయినా వారందరూ మౌనం పాటిస్తున్న అంశం ఒకటుంది.

దేశప్రజల సమష్టి సంపదను కొందరికి ధారాదత్తంచేసిన విధానాన్ని ప్రశ్నించకుండా మౌనం వహిస్తున్నారు. విదేశీ పెట్టుబడులు ఆకర్షించటంలో చైనాతో పోల్చుకుని వగచే పాలకులు చైనా తన యినుప గనులను తవ్వుకోకుండా దాచుకుని మన ఖనిజాన్ని తరలించుకుపోతూ, రాబోయే రోజుల్లో తన వినియోగానికి దాచుకుంటున్న అంశంలో మాత్రం పోలిక తెచ్చుకోరు. మన ఖనిజ వనరులు తరలిపోతే, భవిష్యత్తులో మనం పరిశ్రమలు స్థాపించుకోలేక ఖనిజంకోసం పరాయి దేశాలపై ఆధారపడవలసిన దుస్థితి ఏర్పడుతుందన్న చింత కూడా వారికి లేదు. కనీసం అక్కడే మరో ఉక్కుమిల్లును ప్రభుత్వం స్థాపించినా దాదాపు 30వేల మందికి ఉపాధి దొరికి, అనుబంధ పరిశ్రమలు ఏర్పడటంతోపాటు దేశ అవసరాలు తీరేవన్న ఆలోచన కూడా వారికి లేదు. దారిన పోయే దానయ్యలందరికీ దేశ ఖనిజ వనరులను కారుచౌకగా కట్టపెట్టి తమ వాటాగా జేబులు నింపుకునే యావ తప్ప దేశ ప్రజల ప్రయోజనాలు నెరవేర్చటమన్న లక్ష్యమే నేతలకు లేకుండా పోయింది. కాగా నూతన ఆర్థిక విధానాల పేరిట సహజ సంపదలన్నింటినీ దోచిపెట్టే విధానాన్ని అంగీకరించిందీ, అమలుచేస్తున్నదీ వీరే! అందుకే ఈ విధానాన్ని సరిచేసి దేశ ప్రయోజనాలు నెరవేర్చే విధానాలు రూపొందించమనీ, అమలు జరపమనీ ప్రజలు అడగకుండా చేయటానికి ఈ కీలకాంశాలేవీ చర్చల్లోకి రాకుండా చేస్తున్నారు.

ప్రతిపక్షంలో వున్నంతసేపూ సారా అమ్మకాల గురించి నానాయాగీ చేసే పార్టీలు అధికారంలోకి రాగానే సారా ఆదాయం లేకపోతే ప్రభుత్వం నడవదంటూ వాదనలు చేస్తాయి. రాష్ట్రవార్షిక బడ్జెట్టు లక్షా 40వేల కోట్ల రూ॥లు దాటిందంటూ భుజాలు చరుచుకునే పాలకులు కేవలం 15వేల కోట్ల సారా ఆదాయం లేకపోతే ప్రభుత్వం నడవదని చెప్పటం ఉద్దేశపూరిత అసత్యమే. అసలు విషయమేమంటే ఈ ఆదాయం కాదు! ప్రజలను మత్తులో ముంచి నిస్తేజులను Ô

Ô చేయటమే లక్ష్యంగా సారాను ఏరుల్లా పారిస్తున్నారు. ఆ ఏరుల ఒండ్రును తమ పొలాల్లోకి మళ్లించుకునేందుకు పోటీలు పడి సారా వ్యాపారంలోకి దిగి సమాజాన్ని శాసించే స్థాయికి ఎదుగుతున్నారు. సారా వ్యాపారంలో ఎక్సైజు కానిస్టేబులు నుండి మంత్రివరకూ వ్యవస్థీకృతంగా అక్రమార్జనల పంపకం జరుగుతున్న తీరు ఇన్నాళ్లూ బహిరంగ రహస్యమే. ఈ అక్రమార్జనల పంపకం ముఠా తగవులతో బజారున పడింది.

ఇసుక మాఫియాది మరో కథ. ఇసుక వ్యాపారులు నదినుండి మానవ శ్రమతో ఇసుక తరలించినంతకాలమూ గృహ నిర్మాణానికి ఇసుక చౌకగా లభ్యమైంది. విచక్షణారహితంగా ఇసుక త్రవ్వకాలు సాగలేదు. ప్రభుత్వ ఆదాయానికి గండిపడిందంటూ గగ్గోలుపెట్టి ఇసుక తవ్వకాలు క్రమబద్ధం చేస్తామంటూ వేలంపాటలు పెట్టడంతో, వేలం పాటదారుకు కేటాయించిన రీచ్‌లో వీలయినంత ఎక్కువ ఇసుకను తరలించేందుకు యంత్రాల వినియోగంతోనూ, దానిలో వాటాలు పుచ్చుకున్న నేతల, అధికార గణాల అవినీతితోనూ ఇసుక ధర ఆకాశాన్నంటింది. నదీగర్భమంతా చిన్నాభిన్నమైంది.

(తరువాయి 3వ పేజీలో)

ప్రకటన

## జాతీయ జల విధాన ముసాయిదా: నీటి ప్రైవేటీకరణ చర్యలను ఆపివేయాలి

కేంద్ర ప్రభుత్వం ఇటీవల జాతీయ జల విధానం–2012 ముసాయిదాను చర్చల కొరకు విడుదల చేసింది. 1987లోనూ, 2002లోనూ ప్రకటించిన జాతీయ జలవిధానాల అమలు తీరు తెన్నులను సమీక్ష చేయకుండా కొత్త విధానాన్ని విడుదల చేశారు.

నీరు ప్రకృతి వనరు. ప్రతి పౌరుడికీ దీనిని వినియోగించుకునేందుకు సమాన హక్కు ఉండాలి. పౌరులందరూ సమానంగా నీరు వినియోగించుకొనటాన్ని ప్రభుత్వం గ్యారంటీ చేయాలి. ఇది సర్వత్రా ఆమోదించిన సూత్రం. నీరు ప్రైవేటు ఆస్తి కాదనీ, ప్రభుత్వ ఆస్తి కూడా కాదనీ, లాభార్జన కొరకు నీటి వనరులను వాణిజ్యపరంగా వినియోగించరాదని దీని అర్థం.

కానీ ముసాయిదా ఈ అవగాహనను నిరాకరిస్తున్నది. పర్యావరణ మార్పులు, నీటి వనరుల పునరుజ్జీవనాలను కారణంగా చూపుతూ తాగునీరు, సాగునీరు, పారిశుధ్య నీటి సరఫరాలో ప్రభుత్వ పాత్రను కనీస స్థాయికి తగ్గించేందుకు, నీటి సరఫరాను కంపెనీలకప్పగించేందుకూ తీసుకోవాల్సిన చర్యలను ముసాయిదా ప్రతిపాదించింది. ప్రైవేటీకరణకు దీనినొక సాకుగా వాడుతున్నది. భూగర్భజలాలను రీఛార్చి చేసే వాటర్‌షెడ్ కార్యక్రమాలను నామమాత్రంగానే ప్రభుత్వం అమలు జరుపుతున్నది. భూగర్భజలాలను పరిశ్రమలు విపరీతంగా తోడివేయటానికి అనుమతిస్తోంది. అన్ని కాలుష్యాలనూ నదులలోకి వదులుతూ వాటిని మురుగు కాల్వలుగా తయారుచేస్తున్నది.

నీటి సరఫరాకవుతున్న ఖర్చులన్నింటినీ వినియోగ ఛార్జీల ద్వారా తిరిగి రాబట్టాలని ప్రతిపాదించినా ముసాయిదా, మరోచోట నీటి వినియోగంలో వృధాను అరికట్టేందుకు నీరు, విద్యుత్తు, ఛార్జీలకు ఇస్తున్న సబ్సిడీలను ఆపివేయాలని సూచించింది. దీని అర్థం స్పష్టమే. నీటి సరఫరా బాధ్యత నుండి ప్రభుత్వం తప్పుకొని, దానిని కంపెనీల కప్పగించి, ఇది ఇష్టం వచ్చిన ఛార్జీలను వసూలు చేసుకునేందుకు అనుమతించటమే.

నీటి వినియోగంలో త్రాగునీటికి మొదటి ప్రాధాన్యమివ్వాలని ముసాయిదా చెప్పింది. 65 ఏళ్ల స్వతంత్ర పాలన తర్వాత కూడా ప్రజల తాగునీటి అవసరాలను తీర్చటంలో విఫలమైన ప్రభుత్వం, దీనిని ప్రైవేటు భాగస్వామ్యంతో సాధిస్తానని చెబుతున్నది. ప్రైవేటురంగం నీటిసరఫరాలో విఫలమైందని అనేక ప్రపంచ దేశాల అనుభవం తెలిపింది. ఛార్జీలు పెంచి ప్రజలపై భారాలు పెంచింది. నీటి వనరులు ప్రైవేటు ఆస్తిగా మారి, కంపెనీల లాభార్జన సరుకయ్యింది.

సాగు అవసరాల ధరలన్నింటినీ రోజురోజుకూ పెంచి వేస్తూ, భూసార క్షీణతను పెంచే సాగువిధానాలను ప్రోత్సహిస్తూ ఉత్పాదకతను స్తంభింపచేసిన ప్రభుత్వ విధానాలతో రైతాంగం అనేక సమస్యలతో సతమతమౌతున్నారు. సాగుకు జీవనాధారమైన నీటి ప్రైవేటీకరణతో రైతాంగం నడుము విరుగుతుంది.

2005లో ప్రపంచ బ్యాంకు రూపొందించిన ఒక పత్రంలోని సూచనగా వాటికి అనుగుణంగానే నీటి ప్రైవేటీకరణను ఈ ముసాయిదా ప్రతిపాదించింది. నీటి సరఫరా పోటీని పెంచితే, ధరలను పెంచితే, నీటి వినియోగం సమర్ధవంతంగా సాగుతుందన్న ప్రపంచ బ్యాంకు ఆదేశాలను ప్రభుత్వం అమలు చేయపూనుకుంది.

సాగునీరు, తాగునీరు ప్రైవేటీకరణకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ఆపివేయాలని రైతుకూలీసంఘం(ఆం.ప్ర) డిమాండు చేస్తున్నది. సమాజ సమష్టి సంపదను గుత్త పెట్టుబడిపరం చేయటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నది.

**ఎస్.ఝాన్సి**
**అధ్యక్షులు**
**రైతుకూలీసంఘం(ఆం.ప్ర)**
**(ఏఐకెఎమ్‌కెఎస్ అనుబంధం)**

**12-2-12**
విజయవాడ

# 2012 ఫిబ్రవరి 28న కార్మిక వ్యతిరేక ప్రభుత్వ విధానాలకు నిరసనగా జరిగే అఖిల భారత హర్తాళ్‌ను జయప్రదం చేయండి!

## కార్మికవర్గానికి ఏఐఎఫ్‌టియు (న్యూ) విజ్ఞప్తి

*కార్మిక సోదరులారా!*

సామ్రాజ్యవాదపు, పెట్టుబడిదారీ విధానపు సమస్త విధానాలనూ నూతన ఆర్థిక-పారిశ్రామిక విధానాల పేరిట గత 19 ఏళ్లుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు జరుపుతున్న ఫలితంగా కోట్లాది కార్మికుల, శ్రమజీవుల జీవనం కష్టాలమయమైంది. సంఘటిత రంగంలో ఉద్యోగ కల్పనను కాంట్రాక్టీకరణ, ఔట్‌సోర్సింగ్ పేరిట 5 నుండి 6 శాతానికి తగ్గించారు. మిగిలిన 94 శాతం శ్రమజీవులు అసంఘటిత, స్వయం ఉపాధి, వ్యవసాయ రంగంలో వున్నారు. వీరికెలాంటి సామాజిక సంక్షేమమూ అందుబాటులో లేక దీనస్థితిలో వున్నారు. దీనిని పరిశీలించిన అర్జున్ సేన్ గుప్తా కమిటీ 77 శాతం ప్రజలు (94 కోట్ల మంది) రోజుకు 20రూ॥ల (2004 ధరల ప్రకారం) ఆదాయంతో గడుపుతున్నారని తెలిపింది. మరోవైపున దేశ, విదేశీ పెట్టుబడిదారులూ, పరిశ్రమాధిపతులూ, బహుళజాతి కంపెనీలు కాంట్రాక్టర్లు, ప్రభుత్వ నాయకులు, వారి దళారులూ కోట్లాది రూపాయలు ఆర్జిస్తున్నారు. ప్రైవేటీకరణ విధానాలతో శ్రమజీవుల మానసిక, నైపుణ్య శ్రమను భయంకరంగా దోపిడీ చేస్తున్నారు. కేంద్ర, రాష్ట్రాల ప్రభుత్వాలు-అవి కాంగ్రెస్ పార్టీ, దాని కూటమిలోని పార్టీలు కానివ్వండీ, లేదా బిజెపి, దాని కూటమిలోని పార్టీలు కానివ్వండీ, లేక వామపక్షాలనేవి కానివ్వండీ-ప్రైవేటీకరణనూ, పొరుగు సేవలనూ అమలు జరుపుతున్నాయి. ఉపాధ్యాయులనూ, వైద్యులనూ కాంట్రాక్టు పద్ధతిన నియమిస్తూ విద్యా, వైద్య రంగాలను ప్రైవేటీకరణ సాగిస్తున్నారు. ఫలితంగా విద్య, వైద్యాలు సామాన్యులకు అందుబాటులో లేకుండా పోయాయి. దీనివల్ల అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. ఈ పరిస్థితి లక్షలాదిమంది రైతాంగం ఆత్మహత్యలకూ, శ్రమజీవుల దయనీయ స్థితికి దారితీసింది. మరోవైపున కోట్లకు పడగలెత్తినవారి సంఖ్య ఫ్రాన్సు, బ్రిటను, చైనా, రష్యా, జపాను తదితర దేశాలలోని వారి సంఖ్యను మించిపోయింది. లోక్‌సభ సభ్యులలో 300మంది కోటీశ్వరులే. స్విస్ బ్యాంకుల్లో జమచేసిన నల్లధనంలో భారత రాజకీయ నేతలూ, పెట్టుబడిదారులూ, ఉన్నతాధికారులూ, వారి దళారులదే పెద్దవాటా. భారత శ్రమజీవులు సృష్టించిన ఈ సంపదను దొంగిలించి విదేశీ బ్యాంకులలో దాచిపెట్టుకున్నారు. ఫలితంగా పేద ధనికుల మధ్య వ్యత్యాసం ప్రపంచ దేశాలన్నింటి కంటే ఎక్కువగా ఉంది.

కార్మికులు తమపై సాగుతున్న దోపిడీ అణచివేతలను నిరశిస్తూ గళం విప్పితే తీవ్ర నిర్బంధకాండకు గురిచేస్తున్నారు. హీరోహోండా, మారుతీ సుజికీ తదితర చోట్ల కార్మికుల ఆందోళనలను చూస్తే ఇది స్పష్టమౌతుంది. కార్మిక చట్టాల ఉల్లంఘన సామాన్యమై పోయింది. ఎనిమిది గంటల పని దినమన్నది కనుమరుగైపోయింది. కార్మికుల ప్రావిడెంటు ఫండుకు యజమానులు తమ వాటాను జమ చేయటం లేదు. కార్మిక సంక్షేమం కోసం చేసిన యితర చట్టాలు కూడా నామమాత్రంగా మిగిలాయి. కార్మికులు వీటిని ప్రశ్నిస్తే వారికి దండనే ఎదురౌతుంది. పని నుండి కూడా తొలగించి వేస్తారు. లేబరు అధికారులు, పోలీసులు, ప్రభుత్వ నాయకులూ యజమానుల నుండి డబ్బులు తీసుకుని, యజమానుల కొమ్ముకాస్తూ, కార్మికులపై దమనకాండ సాగిస్తున్నారు.

ఈ భయానక పరిస్థితిలో పోరాటం తప్పనిసరి. ఒక్కరోజు హర్తాళ్‌తో ఏమీ ఒరగదు. సిఐటియు, ఏఐటియుసి, ఐఎన్‌టియుసి, బియంఎస్, హెచ్‌ఎంఎస్ సంఘాల నాయకులు గత రెండు దశాబ్దాలుగా ఇలాంటి హర్తాళ్, ప్రదర్శనలు సాగిస్తూనే వున్నారు. వీటి నుండి కార్మికులకు ఎలాంటి ప్రయోజనమూ చేకూరలేదు. కార్మిక వ్యతిరేక విధానాలను ప్రభుత్వం నిరాటంకంగా అమలు చేస్తూనే వుంది. ఈ ట్రేడ్ యూనియన్‌ల రాజకీయ నాయకులు శాసన సభల్లో కూర్చొని సామ్రాజ్యవాదుల, పెట్టుబడిదారుల సంస్థలైన ప్రపంచబ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్యనిధి, ప్రపంచ వాణిజ్య సంస్థల ఆదేశాల ప్రకారం చట్టాలు చేసి అమలు చేస్తున్నారు. ఈ రాజకీయ పార్టీలకు అనుబంధంగా కార్మిక సంక్షేమమంటూ ఏర్పడిన ట్రేడు యూనియన్లు చట్టసభలకు బయట ఇలాంటి హర్తాళ్లు, ప్రదర్శనలు జరుపుతున్నాయి.

"చట్టసభల్లోపల బేరాలు-బయట బాకాలు"-ఈ నాటకాన్ని ఇంకెన్నాళ్లు సహిస్తారు? ఇటువంటి అవకాశవాద పెట్టుబడిదారీ తైనాతీ కార్మిక నాయకులను ఎండగట్టాల్సిన సమయం వచ్చింది. ఇలాంటి అవకాశవాద, భ్రష్టు పట్టిన నాయకులను వదల్చుకోకుండా స్వశక్తితో వర్గ ఉద్యమాన్ని కార్మికవర్గం అభివృద్ధి చెయ్యలేదు.

ఈ విషయాలను వుంచుకొంటూనే ఫిబ్రవరి 28 హర్తాళ్‌ను విజయవంతం చేయమని మీకు విజ్ఞప్తి చేస్తున్నాము. ఆ తర్వాత నిరవధిక హర్తాళ్‌కు సంసిద్ధం కమ్మని పిలుపునిస్తున్నాము. ఉక్కు, బొగ్గు, విద్యుత్తు, బ్యాంకులు, ఇన్సూరెన్సు, విమానయానం, సంచార్, రైల్వేలు మొదలగు రంగాలను స్థంభింపచేస్తేనే, దేశ పాలకవర్గాలకూ, వాటి ప్రభుత్వాలకూ కార్మికుల ఆందోళనలు చెవిన పడ్తాయి. నిరవధిక హర్తాళ్ కార్మికవర్గం చేతిలోని ఆయుధం. దీనిద్వారానే నేటి క్రూర దోపిడీ వ్యవస్థనుండి మన న్యాయమైన హక్కులను పొందగలుగుతాం.

**కేంద్ర కమిటి**

**ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ (న్యూ)**

## ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాల్ని నిరసిస్తూ ఫిబ్రవరి 28న జరిగే సార్వత్రిక సమ్మెకు సంఘీభావం తెల్పండి!

దేశ వ్యాపితంగా ప్రభుత్వ, ప్రైవేటు రంగాలలోనూ; సంఘటిత, సంఘటితేతర రంగాలలోనూ తమ శ్రమను ధారపోస్తూ సమస్త సరుకుల ఉత్పత్తికి, సమస్త సేవలకు కారకులైన కార్మికులు-దోపిడీ పాలకులనుసరిస్తున్న విధానాల ఫలితంగా తీవ్రసమస్యలనెదుర్కొంటున్నారు. గత రెండు దశాబ్దాల కాలంగా పాలకులు వేగవంతం చేసిన సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాల ఫలితంగా కార్మికుల జీవనం దుర్భరమైంది-కార్మికుల హక్కులన్నీ హరించివేయబడతుతున్నాయి-కార్మికులు తీవ్ర సంక్షోభం నడుమవున్నారు.

ఈ నేపథ్యంలో కార్మికులు తమ హక్కుల సాధనకు, జీవన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాన్ని డిమాండ్‌చేస్తూ దేశవ్యాపితంగా వివిధ కార్మిక యూనియన్‌ల ఆధ్వర్యంలో ఈనెల 28న హర్తాళ్‌కై పిలుపునిచ్చారు. రైతుకూలీసంఘం(ఆంధ్రప్రదేశ్) కార్మికుల సమ్మెకు పూర్తి సంఘీభావాన్నందిస్తున్నది. కార్మికులు, రైతు-కూలీలు, గ్రామీణపేదలు-సమస్త ప్రజానీకం భుజంభుజం కలిపి ఈ దోపిడీ పాలకుల ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడాలని పిలుపునిస్తున్నది.

**విజయవాడ**
**14-2-12**

**ఎస్.ఝాన్సి**
**అధ్యక్షులు**
**రైతుకూలీసంఘం(ఆం.ప్ర.)**
(ఏఐకెఎమ్‌కెఎస్ అనుబంధం)

# పశ్చిమబెంగాల్‌లో పెరుగుతున్న రైతాంగ ఆత్మహత్యలు-ఆత్మహత్యలు కాదని బుకాయిస్తున్న ముఖ్యమంత్రి మమత

**పశ్చిమబెంగాల్** రైతాంగంలో 93 శాతం చిన్న, సన్నకారు రైతులు. వీరిలో అత్యధిక భాగం బాగార్దారులే (పాలురైతులు). కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు జరిపే విధానాల ప్రభావం వెంటనే వీరిపై పడుతుంది. వరి, ఆలుగడ్డ, జూటు పంటలు సాగు చేసే రైతాంగం పాలకుల రైతాంగ వ్యతిరేక విధానాల ఫలితంగా తీవ్ర సమస్యలనెదుర్కొంటున్నారు. గత ఏడాది కేంద్ర ప్రభుత్వం రసాయినిక ఎరువుల ధరల నియంత్రణను వదిలివేసే విధానాన్ని చేపట్టడంతో ఎరువుల కంపెనీలు ధరలను 90 నుండి 140 శాతం వరకూ పెంచి వేశాయి. దీనితోపాటు ఇతర ఖర్చులుకూడా పెరిగి రైతాంగం సాగుకొరకు చేసే రుణాలు పెరిగాయి.

అత్యధికులు చిన్న, సన్నకారు రైతులవటంతో పంట చేతికి రాగానే అమ్ముకొని చేసిన అప్పులు తీర్చుకోవాల్సిన స్థితిలో వుంటారు. కాగా, రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలుకు రాష్ట్ర ప్రభుత్వ సంస్థలను రంగంలోకి దించలేదు. ఫలితంగా 2011 డిసెంబరులో ఆలుగడ్డలు పండించిన రైతాంగం కిలో 70 పైసలకు తెగనమ్ముకోవాల్సి వచ్చింది. ఇప్పుడు వరి రైతాంగం ఈ దుస్థితినెదుర్కొంటున్నారు. ఈ ఖరీఫ్ సీజనుకు 20 లక్షల టన్నుల వరి ధాన్య సేకరణను లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. రాష్ట్ర ప్రభుత్వ సంస్థలైన బాన్‌ఫెడ్, కౌన్‌ఫెడ్ దీనిలో 9 లక్షల టన్నులను సేకరించాల్సివుండగా, మిగిలిన 11 లక్షల టన్నులనూ రైసుమిల్లులు కొంటాయి. వారి నుండి ఎఫ్‌సిఐ సేకరిస్తుంది. రాష్ట్ర సంస్థలు జనవరి మధ్య వరకూ 2 లక్షల టన్నులు మాత్రమే సేకరించాయి. చాలా చోట్ల అవి తమ కొనుగోలు కేంద్రాలను తెరవలేదు. దీని వల్ల రైతాంగం ధాన్యాన్ని క్వింటాలకు 700 నుండి 840రూ॥ మధ్య తెగనమ్ముకోవాల్సిన స్థితి ఏర్పడింది. కేంద్రం 2011-12 సంవత్సరానికి ప్రకటించిన క్వింటాలుకు రూ. 1080 కనీస మద్దతు ధరే గిట్టుబాటుకాని స్థితి వుంటే, రైతాంగం మార్కెట్టు ధరతో ఎంత నష్టపోయారో అర్థమౌతుంది.

ఈ దుర్భర స్థితికి వేదన చెందిన రైతాంగం, చేసిన అప్పులు తీర్చేందుకు దిక్కుతోచక ఆత్మహత్యలనెంచుకున్నారు. 2012 జనవరి 15 నాటికి అందినవార్తల ప్రకారం 21 మంది రైతాంగం ఆత్మహత్యలు చేసుకున్నారు. (పట్టిక చూడండి).

కాగా ముఖ్యమంత్రి మమతాబెనర్జీ రైతాంగ ఆత్మహత్యలను నిరాకరించింది. ఒక్కరైతు మాత్రమే రుణభారంవల్ల ఆత్మహత్య చేసుకున్నాడనీ, మిగిలిన వారు కుటుంబ తదితర సమస్యలతో ఆత్మహత్య చేసుకున్నారని ప్రకటించింది. గతంలా రైతాంగపు ఆత్మహత్య సమస్య ముందుకు వచ్చినప్పుడు కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ముఖ్యమంత్రులు పెళ్ళి తదితర దుబారా ఖర్చులతో రైతాంగం అప్పులపాలై ఆత్మహత్యలు చేసుకున్నారని చేసిన వాదనల వంటిదే మమతా బెనర్జీ వాదన. ఆ తర్వాత ఆ ముఖ్యమంత్రులు వాస్తవాన్ని గుర్తించక తప్పలేదు. పరిస్థితి తీవ్రతను గుర్తించి తగు సహాయక చర్యలు, ప్యాకేజీలూ ప్రకటించక తప్పలేదు.

ప్రపంచబ్యాంకు తదితర సామ్రాజ్యవాద ద్రవ్య సంస్థల ఆదేశాలతో, ఆర్థిక విధానాలతో రైతాంగాన్ని భూముల నుండి గెంటివేసి, భారత వ్యవసాయ రంగాన్ని సామ్రాజ్యవాద కంపెనీలకు తోకగా మార్చే రైతాంగ వ్యతిరేక విధానాలను కేంద్ర, వివిధ రాష్ట్రాల ప్రభుత్వాలు గత 20 ఏళ్లుగా అమలు జరుపుతున్న ఫలితంగానే రైతాంగం అప్పుల ఊబిలో కూరుకుపోయి అప్పులు తీర్చుకునేందుకు పంటలతో పాటు భూమిని కూడా తెగనమ్ముకునే స్థితి ఏర్పడింది.

ఈ దుర్భర స్థితిలో రైతాంగం ఆత్మహత్యలను ఎంచుకోకుండా వారిలో ఆత్మ విశ్వాసం కల్పించడానికి తక్షణ సహాయచర్యలను చేపట్టాలి. (ఉదా॥ ప్రభుత్వరంగ కొనుగోలు సంస్థలను రంగంలోకి దించి ధాన్యం సేకరణకు పూనుకోవాలి. రైతాంగరుణాలపై మారటోరియం ప్రకటించాలి) దీనితోపాటు దీర్ఘకాలిక మద్దతు చర్యలను అమలు పరచాలి. (ఉదా॥ రైతాంగ సాగు అవసరాలకు రుణాలను ద్రవ్య సంస్థల నుండి తక్కువ వడ్డీకి అందజేయాలి)

ఈ తక్షణ సహాయ, దీర్ఘకాలిక మద్దతు చర్యల అమలు కొరకు; అదే సమయంలో పాలకుల రైతాంగ వ్యతిరేక విధానాల సమూలమైన మార్పు కొరకూ సంఘటిత పోరాటాలకు రైతాంగాన్ని సమాయత్తం చేయాలి. రైతాంగ సంఘటిత శక్తిని పోరాట రూపంలో వెలికి తెచ్చినప్పుడే, రైతాంగంలో ఆత్మవిశ్వాసం పెరిగి, ఆత్మహత్యల నెంచుకోకుండా పోరాటమార్గాన్ని ఎంచుకుంటారు. ప్రజాస్వామిక, విప్లవశక్తులు దీనికి పూనుకోవాలి-**ఒక పరిశీలకుడు.**

### ఆత్మహత్యలు చేసుకున్న రైతాంగం

| | రైతు | తేది | జిల్లా |
|---|---|---|---|
| 1. | ధన తుడు | 12-10-2011 | బర్ద్వాన్ |
| 2. | శంభు దాస్ | 14-10-2011 | బర్ద్వాన్ |
| 3. | బుధి తుడు | 16-10-2011 | బర్ద్వాన్ |
| 4. | మాథాయి ఘోష్ | 6-11-2011 | బర్ద్వాన్ |
| 5. | భవానీ పోరేల్ | 15-11-2011 | బర్ద్వాన్ |
| 6. | సఫర్ మెల్లా | 18-11-2011 | బర్ద్వాన్ |
| 7. | తరుణ్ సర్ | 24-11-2011 | బర్ద్వాన్ |
| 8. | నయనమణి పాల్ | 7-12-2011 | బంకురా |
| 9. | ఉత్పల్ గోస్వామి | 8-12-2011 | బర్ద్వాన్ |
| 10. | బరుణ్ పాల్ | 20-12-2011 | బర్ద్వాన్ |
| 11. | రబీన్ బర్మన్ | 21-12-2011 | జల్పాయిగురి |
| 12. | సుంసేన్ కుమార్ ఘోష్ | 28-12-2011 | బర్ద్వాన్ |
| 13. | అమియ సాహా | 1-1-2012 | బర్ద్వాన్ |
| 14. | బోధన్ హజ్రా | 2-1-2012 | బర్ద్వాన్ |
| 15. | అరింద్యమాల్ | 7-1-2012 | బీర్భుమ్ |
| 16. | కెనారామ్ సర్కార్ | 7-1-2012 | మాల్డా |
| 17. | శంకర్ మండి | 19-1-2012 | బర్ద్వాన్ |
| 18. | గోపీనాథ్ బౌరీ | 9-1-2012 | బంకురా |
| 19. | హరిదాస్ రత్న | 12-1-2012 | మాల్డా |
| 20. | తపస్ మాఝీ | 14-1-2012 | బర్ద్వాన్ |
| 21. | రబీంద్రనాధ్ పాత్ర | 15-1-2012 | బర్ద్వాన్ |

## రైతాంగాన్ని తక్షణమే ఆదుకోవాలి

**పశ్చిమబెంగాల్ 1-2-12:**

పశ్చిమబెంగాల్ రైతాంగపు దుస్థితికి తోడు కేంద్రప్రభుత్వం ఎరువుల ధరలను పెంచటంతో వారికి ఖర్చులు పెరిగాయి. పశ్చిమబెంగాల్‌లో ప్రధాన పంటలయిన వరి, జూటు, ఆలుగడ్డలకు గిట్టుబాటు ధరలేదు. సాగుకు చేసిన రుణాలు తిరిగి తీర్చలేక తీవ్రవేదన చెందుతున్నారు. ఇప్పటికి 30 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. రాష్ట్రప్రభుత్వం రైతాంగ దుస్థితిపట్ల నిర్లక్ష్య వైఖరితో వుంది.

గ్రామ పంచాయితీ స్థాయిలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను తెరచి ధాన్యం కొనుగోళ్లకు చర్యలు తీసుకోవాలనీ, ఆత్మహత్య చేసుకున్న రైతుల కుటుంబాలకు 5 లక్షల రూ॥లు నష్టపరిహారం చెల్లించాలనీ, రాష్ట్రరోడ్డు రవాణా సంస్థ ప్రైవేటీకరణ ప్రతిపాదనను అమలుచేయవద్దనీ, రవాణాసంస్థ కార్మికుల వేతనాలనూ, పెన్షన్‌ను తక్షణమే చెల్లించమనీ అక్కడి వామపక్ష శక్తులు డిమాండ్ చేస్తున్నాయి.

# సిరియాపై దురాక్రమణకు సాకులు తయారుచేసుకుంటున్న అమెరికా

**ఇరాక్,** లిబియాలపై దురాక్రమణ సందర్భంగా చేసినట్లుగానే సిరియాపై దురాక్రమణకు సన్నాహంగా అమెరికా దాని కూటమి నాటో దేశాలు అబద్ధాలను ప్రచారంలో పెడుతున్నాయి. ఇరాక్‌పై దురాక్రమణకు సద్దాంహుస్సేన్‌వద్ద విధ్వంస ఆయుధాలున్నాయంటూ బ్రిటన్ వండి వార్చిన రిపోర్టును అమెరికా సామ్రాజ్యవాదులు ప్రచారం చేశారు. ఆ నివేదిక ఒక అబద్ధాల పుట్ట అని తర్వాత తేలింది. లిబియాపై దురాక్రమణను సమర్ధించుకునేందుకు లిబియా ప్రజల ఊచకోతకు గడ్డాఫీ పూనుకుంటున్నాడు గనుక వారిని రక్షించేందుకు జోక్యం చేసుకుంటున్నానని వాదించింది. కానీ తానే ఆయుధాలందించి ప్రతిపక్షంతో హింసా చర్యలు సాగించి, ఆ వంకతో తానే లిబియన్ల ఊచకోతను సాగించింది.

ఇప్పుడు సిరియాపై దురాక్రమణకు తెరలేపేందుకు అమెరికా, నాటోలు తాము అరబ్ లీగు కోరిక మేరకే జోక్యం చేసుకోవాల్సి వస్తుందని ప్రచారం చేస్తున్నారు. ప్రతిపక్షంపై హింసా ప్రయోగాన్ని ఆపమన్న తన డిమాండును అమలు చేయటంలో బషర్ అల్ అస్సద్ ప్రభుత్వం విఫలమైందన్న నిర్ధారణకు అరబ్ లీగు వచ్చిందని వారంటున్నారు.

ఈ 'వైఫల్యాన్ని' పేర్కొంటూ సిరియాపై ఒక తీర్మానాన్ని ఐరాస భద్రతా మండలిలో అరబ్‌లీగ్ ప్రతిపాదించింది. అరబ్‌లీగ్ పంపిన పరిశీలకుల బృందం పనిసాగకుండా అక్కడ చెలరేగుతున్న హింస ఆటంకపరిచిందని కూడా ఆ తీర్మానంలో పేర్కొన్నారు. ఈ అరబ్‌లీగ్ తీర్మానాన్ని అమెరికా, ఫ్రాన్సు, బ్రిటన్‌లు సమర్ధించగా, రష్యా, చైనాలు వీటో చేశాయి. దీనితో తీర్మానం వీగిపోయింది.

ఐరాసలో అమెరికా రాయబారి శ్రీమతి సుసాన్‌రైస్ ఈ వీటోను "సిగ్గుచేటు, అసహ్యకర" మని వ్యాఖ్యానించింది. అమెరికా మంత్రిణి హిల్లరీ క్లింటన్ ఐరాసను "నపుంసకుడి"గా చేసిన "హాస్యాస్పద చర్య" అని వీటోను ఖండించింది.

సిరియా మాజీ వలస పాలకుడైన ఫ్రాన్సు, వీటోను ఐరాస "నీతిబాహ్యత"గా వర్ణించగా, దాని విదేశాంగ మంత్రి వీటో చేసిన రష్యా , చైనాలు "పొత్తి కడుపులో తన్నడానికి" అర్హమైనవని కోపాన్ని వెళ్లగక్కాడు.

అమాయక పౌరులను హత్యకావిస్తూ గాజా, వెస్ట్‌బ్యాంక్, లెబనాన్‌లపై ఇజ్రాయిలు బాంబు దాడులు సాగించటాన్ని ఖండిస్తూ ఐరాస భద్రతా మండలి ముందుకు వచ్చిన తీర్మానాలను అమెరికా సామ్రాజ్యవాదం పదేపదే వీటో చేసినప్పుడు, ఇలాంటి అమర్యాదకర భాషా ప్రయోగంతో కూడిన ఖండన చేయడం సంగతలావుంచి, కనీస వ్యతిరేకత కూడా ఏనాడూ వ్యక్తంకాలేదు. ఈ ఖండనలలో నైతిక వర్తనం, మానవహక్కుల పట్ల గౌరవం ఎక్కడ చచ్చింది-అక్కసు, ఆక్రోశం తప్ప.

దీని సంగతి అలా వుంచి, అసలు ఆరబ్‌లీగ్ సంగతి చూద్దాం. రాజకీయంగా అమెరికా కనుసన్నలలో వుండే గల్ఫ్ దేశాలలోని రాచరిక పాలనసాగే ఆరబ్బు దేశాలతో ఆరబ్‌లీగ్ ఏర్పడింది. దీనికి అధ్యక్షుడిగా ప్రస్తుతం కతార్‌వుంది. ఇది సిరియాకు ఒక పరిశీలకుల బృందాన్ని పంపాలని నిర్ణయించింది. ఈ పరిశీలక బృందం సిరియాకు రావటానికి అంగీకరిస్తూ సిరియా ప్రభుత్వం 2011 డిసెంబరు 19న ఒక పత్రంపై సంతకం చేసింది "సిరియా అంతటా ఈ బృందం స్వేచ్ఛగా రక్షణతో పర్యటించేందుకు అన్ని విధాలా తోడ్పడేందుకు తన సంసిద్ధతను" సిరియా ప్రభుత్వం 2011 డిసెంబరు 22న ప్రకటించింది. బృందం కోరుకున్న ఎవరితోనైనా సమావేశాలు "స్వేచ్ఛగా నిర్వహించు'కునేందుకు అనుమతిని కూడా యిచ్చింది.

దీనికనుగుణంగానే 2011 డిసెంబరు 24 నుండి 2012 జనవరి 18 వరకూ పరిశీలకుల బృందం సిరియాలో పర్యటించింది. 13 ఆరబ్ దేశాలకూ, ఆరు ఆరబ్ సంస్థలకూ చెందిన 166మంది సభ్యులతో పరిశీలక బృందం ఏర్పడింది. వివిధ ఆరబ్ దేశాలకు చెందిన 10 మంది సభ్యులతో కూడిన 15 గ్రూపులుగా ఏర్పడి ఈ బృందం సిరియాలోని 20 పట్టణాలలోనూ, జిల్లాలలోనూ పర్యటించింది. ఈ పరిశీలక బృందానికి సూడాన్‌కు చెందిన జనరల్ ముహమ్మద్ అహమ్మద్ ముస్తఫాఅల్‌దాబి అధ్యక్షుడిగా వ్యవహరించారు. ఆయన నివేదికలో బృందాల పర్యటన "పూర్తిగా విఘాతాలు లేకుండా'' సాగిందని పేర్కొన్నారు. బృందాన్ని మరికొంతకాలం కొనసాగించమని కూడా కోరాడు.

కానీ ఆరబ్‌లీగు పరిశీలనా బృందాన్ని ఆపివేసింది. దాని నివేదికను బయటపెట్టకుండా తొక్కిపెట్టింది. కతార్, సౌదీ అరేబియాలు కలిసి ఈ పని చేశాయి.

**పరిశీలక బృందం నివేదిక పూర్తి పాఠాన్ని గ్లోబల్ రిసెర్చి తన వెబ్‌సైట్లో పెట్టింది. సిరియాలో అంతర్యుద్ధాన్ని రగిల్చి దాన్ని సాకుగా చూపి అక్కడ తమకనుకూల ప్రభుత్వాన్ని నెలకొల్పేందుకు కొన్ని గల్ఫ్ దేశాల ప్రభుత్వాలూ, టర్కీతో కలిసి అమెరికా, ఫ్రాన్సు, బ్రిటన్‌లు ప్రయత్నాలు చేస్తున్నాయన్న అంశాన్ని నివేదిక బహిర్గత పరిచింది.**

ఈ నివేదిక పూర్తి పాఠం నుండి కొన్ని భాగాలు ఇక్కడ పేర్కొంటున్నాము :

26. హోమ్స్ , దేరా పట్టణాలలో ప్రభుత్వ బలగాలపై హింసాత్మక చర్యలు జరిగినట్లు, దానివల్ల ఆ బలగాలలో మరణాలు, గాయాలూ సంభవించినట్లు పరిశీలక బృందం గమనించింది. కొన్ని సందర్భాలలో తమపై దాడులకు స్పందనగా ప్రభుత్వ సాయుధ బలగాలు బలప్రయోగం చేశాయి. మంటలను వెదజల్లే ఆయుధాలనూ, దహన రక్షక కవచాన్ని చీల్చే అమ్ములనూ సాయుధ ముఠాలు వాడినట్లు బృందం గమనించింది.

27. హోమ్స్, ఇడ్లిబ్, హమా పట్టణాలలో ప్రభుత్వ బలగాలపైనా పౌరులపైనా హింసాత్మక దాడులు జరిగాయనీ, వీటిలో అనేక మరణాలు, గాయపడటాలు జరిగాయని బృందం గమనించింది. ఉదాహరణకు, పౌరులు ప్రయాణించే బస్సుపై బాంబు దాడిలో 8 మంది మరణించారు. స్త్రీలు, పిల్లలతో సహా అనేకులు గాయపడ్డారు. డీజిలు తీసుకువెళ్తున్న రైలుపై బాంబులు వేశారు. హోమ్స్ పట్టణంలో పోలీసు బస్సును బాంబుతో పేల్చివేయగా 8 మంది పోలీసులు మరణించారు. డీజిలు పైపులైను, కొన్ని వంతెనలను ధ్వంసం చేశారు.

28. అనేక చోట్ల పేలుళ్లు, హింసా సాగాయని అనేక పార్టీలు ఫిర్యాదు చేశాయి. పరిశీలకులు ఆ ప్రాంతానికి వెళ్లి చూసినప్పుడు ఆ ఫిర్యాదులు నిరాధారమని తేలింది.

29. క్షేత్రస్థాయిలోని బృందాల సమాచారాన్ని పరిశీలించినప్పుడు, ఘటన స్వభావాన్ని, వాటిలో మృతిచెందిన వారి సంఖ్యనూ, నిరసన ప్రదర్శనలనూ మీడియా అతి చేసి రిపోర్టు చేయటాన్ని బృందం గమనించింది.

30. ప్రభుత్వ మద్దతుదారులూ, ప్రతిపక్ష మద్దతుదారులూ అనేక చోట్ల శాంతియుతంగా ప్రదర్శనలు చేయటాన్ని పరిశీలకులు చూసారు. ఇరుపక్షాల మధ్య అడపాదడపా చిన్న గొడవలు తప్ప, పోలీసులు కల్పించుకొని ఆపివేసిన స్థితి ఏర్పడలేదు. జనవరి 8 వరకూ వీటివల్ల ఎలాంటి హింసా జరగలేదు.

33. ప్రభుత్వం అరెస్టు చేసిన వారి సంఖ్య 16237 అని సిరియాకు వెలుపలనున్నవారు పరిశీలకుల బృందానికి చెప్పారు. దేశంలో వున్న ప్రతిపక్షం 12,005 మందని చెప్పింది. కాగా బృందం తన క్షేత్ర స్థాయి పరిశీలనలో ఈ లెక్కలలో అనేక లోపాలున్నట్లు గుర్తించింది. వీరిచ్చిన లిస్టులలో సరైన సమాచారం లేదు. అనేక పేర్లు పునరావృతమయ్యాయి. ఈ లిస్టులను ప్రభుత్వానికిచ్చి వివరాలతో తెలపమని కోరాము.

35. 2012 జనవరి 12న అధ్యక్షుడు ఒషర్ అల్ అస్సద్ 2011 మార్చి 15 ఘటనలలో జరిగిన నేరాలకు క్షమాభిక్షను ఇస్తూ డిక్రీని జారీ చేసాడు. ఈ డిక్రీ అమలులో భాగంగా, అధికారులు విడతలుగా అరెస్టు అయిన వారిని విడుదల చేస్తున్నారు. క్షమాభిక్ష ఇచ్చిన నేరాలు తప్ప ఇతర నేరాలు చేసిన వారిని విడుదల చేయలేదు. ఈ విడుదలను పరిశీలక బృందం పర్యవేక్షించింది. అంతేకాక బృందం సభ్యులు చూస్తుండగానే విడుదల జరిగింది.

36. 2012 జనవరి 19న మొత్తం 3569 మందిని విడుదల చేసినట్లు ప్రభుత్వం ప్రకటించింది. వీరిలో 1669 మందిని విడుదల చేసినట్లు బృందం గమనించింది. మిగిలిన కేసులు జరిగాయోలేదో ఇంకా పరిశీలనను కొనసాగించాలి.

37. క్షమాభిక్షకు ముందు 4,035 మందినీ, క్షమాభిక్ష తర్వాత 3569 మందినీ, మొత్తం 7604 మందిని విడుదల చేసినట్లు ప్రభుత్వం తెలిపింది. వీటిలో క్షమాభిక్షకు ముందు 3,483 మంది, ఆ తర్వాత 1669 మంది మొత్తం 5152 మంది విడుదల అయ్యారని బృందం నిర్ధారించుకుంది. మిగిలిన వారి విషయం ఇంకా పరిశీలించాల్సివుంది.

45. బృంద సభ్యులుగా పంపిన వారికి ఈ రంగంలో ఎలాంటి నిపుణతా లేదు. తగిన సామర్ధ్యం లేదు.

46. వీరిలో కొందరికి తాము తీసుకున్న బాధ్యత ఎంత గురుతరమోకూడా తెలియదు. వ్యక్తిగత ప్రయోజనాలకంటే ఆరబ్ ప్రజల ప్రయోజనాలు ముఖ్యమని గుర్తించలేదు.

50. కొందరు పరిశీలకులు తమ బాధ్యతలకు ద్రోహం చేశారు. తాము చేసిన ప్రతిజ్ఞను భంగ పరిచి తమ దేశ అధికారులతో సంబంధం పెట్టుకుని, ఇక్కడి ఘటనలను అతి చేసిన,వారికి చెప్పారు. ఈ పరిశీలకులు ఇక్కడి పరిస్థితిపై నిరాశావహ దృష్టి నేర్పరచుకున్నారు.

68. బృందం పరిశీలన మొదలు పెట్టిన నాటి నుండి దానిపై బురదజల్లే ప్రచారానికి గురైంది. బృందం అధ్యక్షుడికి అంటగట్టుతూ మీడియా అనేక ప్రకటనలను ప్రచారం చేసింది. ఘటనలనూ అతిచేసి చూపి, వాస్తవాన్ని వక్రీకరించేపని మీడియా చేసింది.

69. మీడియా చేస్తున్న ఇలాంటి ప్రచారం సిరియా ప్రజల్లో ఉద్రిక్తతలు కలిగించింది. బృందం ప్రతిష్టను దెబ్బతీసే పనికి మీడియా సంస్థలు కొన్నింటిని వాడుకున్నారు.

71. బృందం ఏర్పాటులో దాని ముందుంచని (ప్రోటోకాల్) సాయుధ సంస్థ ఒకటి వుందని బృందం గుర్తించింది. బృందం రాకకు ముందు సాగిన నిరసనలకు ప్రతిగా ప్రభుత్వం అతిగా స్పందించిన ఫలితంగా ఈ సంస్థ ఏర్పడిందని చెప్పవచ్చు. ఈ సంస్థ సిరియా పౌరులూ, భద్రతా దళాలపై దాడులు చేయటంతో ప్రభుత్వం మరింత హింసను ప్రయోగించింది. చివరికి అమాయక పౌరులు బలయ్యారు.

72. బృందం పని సజావుగా సాగేందుకు ప్రభుత్వం అన్ని సహకారాలూ అందించింది.

74. కొన్ని పట్టణాలలో బృందం తీవ్ర ఉద్రిక్తతనూ, అణచివేతనూ, అన్యాయాన్ని గమనించింది. వీటికి సిరియా పౌరులు గురౌతున్నారు. అయినప్పటికీ ఈ సంక్షోభాన్ని అంతర్జాతీయ జోక్యం లేకుండా ఆరబ్ మధ్యవర్తిత్వంతోటే పరిష్కరించుకోవచ్చునని పౌరులు విశ్వసిస్తున్నారు.

75. వివిధ పక్షాల మధ్య అఘాతాన్ని పెంచే ఘటనలు ఇటీవల జరిగాయి. ఈ ఘటనలు మరణాలతో సహా తీవ్ర పరిణామాలకు దారితీస్తాయి. ఇళ్లపైనా, రైళ్లపైనా, డీజిలు రవాణా వాహనాలపైనా బాంబులు వేయటం; పోలీసులు, మీడియా, పైపులైన్లు లక్ష్యంగా పేలుళ్లు వీటిలో వున్నాయి. ఈ దాడులను ఫ్రీ సిరియన్ ఆర్మీ మరి కొన్ని సాయుధ సంస్థలు చేసాయి. (**ఫ్రీ సిరియన్ ఆర్మీకి ఆయుధాలూ, నిధులు టర్కీ ద్వారా అమెరికా అందజేస్తున్నది. వివరాలు 5-2-2011 జనశక్తి సంచిక చూడండి-సంపాదకుడు)**

పరిశీలక బృందం అధ్యక్షుడు అల్‌దబీ-బృందానికిచ్చిన 23 రోజులూ తక్కువనీ, బృందాన్ని ఇంకా కొనసాగించమనీ అది సిరియా ప్రజలలో ఉద్రిక్తతను తగ్గించి పరిష్కారానికి తోడ్పడుతుందన్న విజ్ఞప్తితో నివేదికను ముగించాడు. బృంద సభ్యుల కృషితో కొన్ని చోట్ల ప్రభుత్వం తన బలగాలను వెనక్కి పిలవటానికి అంగీకరించటంతో నడలిన ఉద్రిక్తతను కూడా పేర్కొన్నాడు. సౌదీ అరేబియా, కతార్‌లు పరిశీలక బృందానికి తమ మద్దతును ఉపసంహరించి, అది విఫలమయిందని ప్రకటించాయి.

అయితే నిజమైన వైఫల్యం అమెరికా సామ్రాజ్యవాదానిది. సిరియాలో ప్రభుత్వాన్ని మార్చే దాని ప్రయత్నాలను బృందం నివేదిక సమర్ధించ లేదు. దీనికి విరుద్ధంగా అంతర్జాతీయ జోక్యం లేకుండా అరబ్ మధ్యవర్తిత్వంతో శాంతియుతంగా పరిష్కరించుకోవాలని సిరియా ప్రజలు స్పష్ట పరిచారు.

తన సామ్రాజ్యవాద ప్రయోజనాలు **నెరవేర్చుకునేందుకు అమెరికా సామ్రాజ్యవాదమనుసరించే విధానం మరోసారి బట్టబయలైంది. స్పష్టంగా అది ఒక దేశంలో అంతర్యుద్ధాన్ని రెచ్చగొట్టడం, దానిని అణచేందుకు తప్పని సరై అక్కడి ప్రభుత్వం పూనుకుంటే మానవ హక్కుల ఉల్లంఘన అంటూ దానిని ఖండించటం, దీన్ని సాకుగా చూపి సాయుధ జోక్యానికి పూనుకోవటం. సాధారణ వ్యవహారమయ్యింది.**

**ఈ విధానాన్నే లిబియాలో అమలు జరిపారు. అప్పుడు రష్యా, చైనాలు ఐరాస తీర్మానాన్ని వీటోచెయ్యకుండా ఓటింగు నుండి గైర్హాజరయ్యాయి. దానితో విమానాలు ఎగురలేని ప్రాంతమన్న తీర్మానాన్ని తమదురాక్రమణకి ఆమోదంగా చెప్పుకుంటూ లిబియాపై నిరంతర బాంబుదాడులు చేశారు. వేలాది లిబియా ప్రజలను ఊచకోతకోశారు. ఇపుడు సిరియాపై దురాక్రమణకి సాకులు తయారు చేస్తున్నారు. ఇదే సామ్రాజ్యవాద దుష్టనీతి.**

N

**ప్రజల మూలుగులను...** (మొదటి పేజీ తరువాయి)

ఈ విధంగా అవినీతి-అక్రమార్జనలు ప్రజల కష్టార్జితాన్ని కొల్లగొట్టడంతోపాటు ప్రజల సమష్టి సంపద అయిన ప్రకృతి వనరులను కొద్దిమంది లాభార్జనకు కట్టబెడుతున్నాయి. ఈ క్రమంలో ప్రజల జీవనాన్నీ, జీవనాధారాలనూ ఛిద్రంచేస్తున్నాయి.

వాదోప వాదాలతోనూ, పరస్పర నిందారోపణలతోనూ అవినీతి, అక్రమార్జనలకు మూలాధారమైన విధానాలను చర్చించకుండా, శాసన సభలో కాలం వెళ్లబుచ్చుతూ దానినే ప్రజాస్వామిక ప్రక్రియగా చిత్రించటంలో పాలకవర్గ పార్టీలు ఆరితేరాయి. దేశ ఆర్థిక, రాజకీయ, సామాజిక మూలుగులను పీల్చి పిప్పిచేస్తున్న అవినీతి అక్రమార్జనలు ప్రజలలో కోపాగ్నిని రగుల్చుతున్నాయి. దీనిని చల్లార్చేందుకు పాలకులే బూటకపు అవినీతి వ్యతిరేక పోరాటాలను నడుపుతున్నారు. ఎందుకూ కొరగాని లోక్‌పాల్-జన్‌లోక్‌పాల్ బిల్లులపై చర్చతో తామేదో ఒరగబెట్టబోతున్నట్లు ఆశలు కల్పించబూనుకున్నారు.

అర్థభూస్వామ్య వ్యవస్థలో దళారీ పెట్టుబడిదారీ విధానమూ, సామ్రాజ్యవాదాల ఆధిపత్యాలకు పుట్టిన వికృత శిశువు భారత ప్రజాస్వామ్యం. దీనికి ప్రజాస్వామ్యమన్న పేరుతప్ప నిజమైన అర్థంలో ప్రజాస్వామ్యమన్నదే లేదు. ఏ దశలోనూ, ఏ స్థాయిలోనూ విధాన నిర్ణయంలో ప్రజలకు ఎలాంటి పాత్రా లేదు. ప్రజలను తిరుగుబాటుదారులుగా చూసి వారిని అణచివుంచటమే లక్ష్యంగా రూపొందించిన వలస పాలనావ్యవస్థనూ, చట్టాలనూ యధాతథంగా స్వీకరించిన భారత దోపిడీపాలక వర్గాలు నేటికీ సామ్రాజ్యవాద ప్రయోజనాలకు సేవ చేయటమే లక్ష్యంగా పనిచేస్తున్నాయి. వలసపాలన నాటికంటే వందలరెట్లు అధికంగా దేశ ఆర్థిక, సహజ వనరులను సామ్రాజ్యవాదులకు తరలించి పెడుతున్నాయి. ఈ క్రమంలో తమ అక్రమార్జనలను కూడా విదేశీ బ్యాంకులకు తరలించి విదేశీ ద్రవ్యపెట్టుబడికి వనరులుగా ఉపయోగపడుతున్నాయి. సామ్రాజ్యవాదుల ఆజ్ఞల మేరకు నిర్మించిన రహదారులపై ప్రమాదాల నివారణా చర్యలకు కూడా వారు విదిలించే మెతుకుల కొరకు దేబిరిస్తూ, దానిలో తాను గతక కలిగిన వాటాను ఊహించుకుంటూ గుటకలువేసే దౌర్భాగ్య స్థితిలో దేశ పాలకులున్నారు.

పురుగులుపడి పుచ్చిపోయిన మేడిపండువంటి ఈ దోపిడీ వ్యవస్థను భూస్థాపితం చేయకుండా భారత ప్రజల జీవితంలో సుఖశాంతులు నెలకొనవు. ఈ మేడిపండును మేలిమి పండుగా చిత్రించే పాలకుల వంచనకు లోనుకాకుండా అవినీతి-అక్రమార్జనలను నిరసిస్తూ, అక్రమార్జనలను స్వాధీనంచేసుకుని ప్రజాసంక్షేమానికి వినియోగించాలని కోరుతూ, వీటికి మూలమైన పాలక వర్గాల విధానాలపైన కూడా సంఘటిత పోరాటాలకు సిద్ధంకావాలి.

N

## కా॥గాదె నరసింహారెడ్డికి జోహార్లు

**సీనియర్** కమ్యూనిస్టు కా॥గాదె నరసింహారెడ్డి (88సం॥లు) గుంటూరుజిల్లా కాజ గ్రామంలో జనవరి 24వ తేదీన మరణించారు. కా॥గాదె నరసింహారెడ్డి రైతు యువకుడిగా కమ్యూనిస్టు పార్టీ పట్ల ఆకర్షితులై పనిచేసే క్రమంలో 1948లో కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వం పొందారు. కమ్యూనిస్టు పార్టీ పట్ల అంకితభావంతో పనిచేశారు. అనేక ఇబ్బందులు, ప్రభుత్వ నిర్బంధాలను ఎదుర్కొని నిలిచారు. కా॥గాదె నరసింహారెడ్డి మృతిపట్ల కాజ పార్టీ కామ్రేడ్స్, రైతుకూలీసంఘం నాయకులు జోహార్లర్పించారు.

# అమెరికా విద్యావ్యవస్థ-దాని అభివృద్ధి నిరోధకత్వం

జాన్‌కోజీ

జాన్‌కోజీ తత్వ, తార్కిక శాస్త్ర విశ్రాంత ఆచార్యుడు. కొరియా యుద్ధంలో అమెరికా సైనికుడిగా పనిచేసిన తర్వాత 20 ఏళ్ళ పాటు విశ్వవిద్యాలయ ఆచార్యునిగా పనిచేశారు. సామాజిక, రాజకీయ, ఆర్థిక సమస్యలపై అనేక వ్యాసాలు రాసారు. భారతదేశంలో నూతన విద్యావిధానం పేరిట సాగుతున్న మార్పులు-సామాజిక శాస్త్రాల, శాస్త్ర వాణిజ్యాలనూ నిర్లక్ష్యపరచి అనువర్తిత సాంకేతికను (అప్లయిడ్ సైన్సెస్) ప్రోత్సహించడం; ఉపాధి కల్పన పేరిట విశ్వవిద్యాలయాల బోధనాంశాలకు పరిశ్రమల అవసరాలకు అనుసంధానం చేయటం తదితరాలు-దీర్ఘకాలంలో ఎలాంటి దుష్ఫలితాలనిస్తుందో అర్థం చేసుకోవటానికి ఈ వ్యాసం తోడ్పడుతుంది. - సంపాదకుడు

**నేడు** విద్యావ్యవస్థలు కంపెనీ అవసరాలను తీర్చేందుకు కార్మికులకు శిక్షణగరపుతున్నాయి. కంపెనీల కోసమే జనముండే సమాజమంటే అది బానిసత్వమే. విద్యను ఉపాధి శిక్షణతో సమానం చేసే భావన చాలా లోతైన సమస్య. ఒక విద్యారంగ ప్రముఖుడి మాటల్లో మానవుడు పనితో మాత్రమే జీవించడు. వాస్తవానికి పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థలో బ్రతుకు తెరువుకోసం సముపార్జించే జ్ఞానమూ, నైపుణ్యాలూ మానవ సంబంధాలు నెరపటంలో ఉపయోగపడవు. మానవ సంబంధాలే ప్రతిఒక్కరి జీవనానికీ మూలాధారం. ఉపాధి శిక్షణ నిచ్చే పాఠశాలల్లో సాంస్కృతిక వైవిధ్యాన్ని బోధించేందుకూ, మన పక్కింటి వారినీ, పొరుగు దేశాలవారినీ అర్థం చేసుకునే ప్రయత్నానికీ అవకాశం వుండదు. అది విలువ వ్యవస్థలనెప్పుడూ సమీక్షించదు; ప్రత్యామ్నాయాల పరిశీలన జరపదు. ఫలితంగా, మనమందరమూ ఈ భూమిపైనే నివశిస్తున్నప్పటికీ, మనం కలిసి జీవించటంలేదు. మహాఅయితే ప్రక్కప్రక్కన బ్రతుకుతున్నాం లేదా అధమంగా ఒకరినొకరు చంపుకునేందుకు బ్రతుకుతున్నాం. శిక్షణగరపే విద్యావ్యవస్థ ప్రతిదానినీ భావజాలానికి కుదించివేస్తుంది; మన కళ్లముందున్న వాస్తవికతను చూడనివ్వదు. ఎందుకంటే భావజాలం చూపుకు రంగులద్దుతుంది. అందువల్ల ప్రజలు గత తరాలకంటే విజ్ఞాన వంతులు కాలేరు. మెడలో వేలాడే డబ్బాను చూపుతూ, యజమాని జేబులు నింపేందుకు యాచనచేసే కోతులుగా ప్రజలు మార్చబడతారు. ఈ జీవినే మనం మనిషి అంటున్నాము. ఎంతటి భ్రమ!

అమెరికాలోనూ, బహుశా ఇతర దేశాల్లోనూ విద్యగా చలామణి అవుతున్న దాని ఫలితాలను చూసి నేను అనేక సంవత్సరాలుగా ఆందోళన చెందుతున్నాను. ఉదాహరణకు, గతతరంకంటే తర్వాతి తరం ఎందుకు జ్ఞానవంతులు కాలేకపోతున్నారు? దాని గురించో, దీనిగురించో చాలానే తెలుసుకొని వుండవచ్చును. అయితే ఆ "తెలుసుకోవటం" ఎందుకు జ్ఞానంగా పరిణమించటంలేదు? మరో మాటల్లో చెప్పాలంటే జనులెందుకు జ్ఞానులు కావటంలేదు? చేసిన తప్పుల్నే మళ్లీమళ్లీ ఎందుకు చేస్తూపోతున్నారు?

ఒకరికి నిపుణత్వాన్ని అందించటమూ, ఒక వృత్తిని సాగించగల శిక్షణనివ్వటాన్ని మించి విద్యవుండాలని దశాబ్దాలుగా భావిస్తున్నాం. ఉదాహరణకు క్రింది ఉల్లేఖన చూడండి:

"విద్య అంటే శిక్షణే కాదు. నైపుణ్యానికీ, జ్ఞానానికీ మధ్య తేడాను ప్లాటో చెప్పాడు. ఒక వ్యక్తి విద్యావంతుడవటమంటే ఒకానొక సాంకేతిక నైపుణ్యాన్ని పొందటాన్ని మించి ఉండాలి. సృజనాత్మక అర్థవంత జీవితం సాగించటం కొరకు ప్రపంచంలో తన సహజ, సాంస్కృతిక స్థానాన్ని అర్థం చేసుకోగలగాలి. ఎడ్మండ్ బర్క్ అన్నట్లు ఈ రోజుపుట్టి రేపుపోయే దీపపు పురుగుల్లా కాకుండా, ఏదోపుట్టాం కాబట్టి బ్రతుకుతున్నామన్నట్లు కాకుండా, గతతరంతోనూ, రాబోయే తరంతోనూ బంధించే సామాజిక ఒప్పందంలో భాగంగా జీవించేందుకు చారిత్రక దృక్పథాన్ని కూడా ఏర్పరచుకోగలగాలి. కనుక ఈ లక్ష్యాలను సాధించే విద్య మాత్యూ ఆర్నాల్డ్ అన్నట్లు "తెలిసిన దానిలో ఉత్కృష్టమైనదంతా" కలిగి వుండాలి. మొత్తం మానవ ప్రపంచం, దాని చరిత్ర, మన సంస్కృతి, దీనికి భిన్నమైన ఇతర సంస్కృతులు...సమగ్ర అవగాహనను అందించాలి"

ఇలాంటి విద్యావంతుడి గురించి పునరుజ్జీవన కాలంలో తరచుగా వినపడేది. నేడు వినిపించటంలేదు. (పై అర్థంలో) విద్యావంతులు లేరు. మనం పైన చెప్పిన యాచక కోతులుగానే వుంటున్నాము.

"గవర్నర్ రికీ స్నైడర్ పునః శిక్షణా కార్యక్రమాలను కంపెనీల అవసరాలతో ముడివేయాలని కోరుతున్నాడు. ప్రపంచ మార్కెట్టులో పోటీ సమర్థతను పెంచుకొనేందుకు ప్రారంభించిన చొరవ క్రింద మిచిగాన్ పౌరులు గణితం, శాస్త్రవిజ్ఞానంలో డిగ్రీలు పొందేందుకు ప్రోత్సహించాలి."

కంపెనీల అవసరాలు తీర్చే విద్యను నేర్వమని మిచిగాన్ పౌరులను గవర్నరు స్నైడర్ కోరుతున్నారు. కార్మికుల అవసరాలను కంపెనీలు తీర్చమనికాదు. యాచక కోతులుగా శిక్షణ పొందమంటున్నాడు. అధ్యక్షుడు ఒబామా కూడా ఇవే మాటలు చెబుతున్నాడు.

ఇక్కడే ఒక పెద్ద తప్పుంది. ఒక మానవేతర సంస్థ కొరకే ప్రజల వునికి వుండే సమాజం బానిసత్వంలో కూరుకుపోతుంది. అలాంటి ఉనికి కోసం నైపుణ్యాన్ని పొందేందుకు కార్మికులు డబ్బు చెల్లించాలని గుర్తిస్తే ఈ తప్పు ఎంత పెద్దదో తెలుస్తుంది. అర్ధబానిసలయ్యే సౌకర్యం పొందేందుకు (ఫీజులు) చెల్లించమని విద్యార్థులకు చెబుతున్నారు.

ప్రకృతిలో జీవులు తాముగానే తమ వునికిని కలిగివుంటాయి. అవి చేసే ప్రతి పనినీ తమ కోసమో, తమ పిల్లల కోసమో చేస్తాయి. అడవి గుర్రం ఇతర గుర్రాలకు లాభం కలిగించేందుకు నైపుణ్యాన్ని ఆర్జించదు. కానీ మనిషి దాన్ని మచ్చిక చేసుకుని, శిక్షణనిచ్చి, తన లబ్ధి కొరకు వాడుకున్నప్పుడు, దాని సహజ అవసరాలన్నింటినీ అతను తీరుస్తాడు. తమకు శిక్షణ గరపమని గుర్రాలు అడుక్కోవు. బానిసలుగా శిక్షణ నిమ్మని జనం యాచించే అవసరమేర్పడటం ఎంతటి వికృతత్వం?!

అయితే యాచక కోతి, స్వారీ గుర్రం విద్యావంతులు కావు. అవి శిక్షణ మాత్రమే పొందాయి. పునరుజ్జీవ కాలపు కోతి అన్నదే లేదు.

అమెరికాలోనూ, బహుశా ఇతర దేశాల్లోనూ, విద్య పగిలిన అద్దం ముక్కల్లా వుంది. కేంద్ర విద్యాశాఖకున్న అధికారమంతా నిధులతో పాఠశాలలను లొంగదీసుకోవటం. ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లున్నాయి. ప్రభుత్వ స్కూళ్లను స్థానిక బోర్డులు నియంత్రిస్తాయి. రాష్ట్ర బోర్డులుంటాయి. స్థానిక బోర్డులపై దాని ప్రభావం కొంతవుంటుంది. అమెరికాలో విద్య స్థానిక వ్యవహారమే. స్థానిక బోర్డుల సభ్యులకు చదవటమూ, రాయటమూ కూడా వచ్చివుండాల్సిన అవసరం లేదు. విద్యార్థులకు ఏమిబోధించాలో, ఎలా బోధించాలో వీరే నిర్ణయిస్తారు. ఉదాహరణకు పరిణామవాదాన్ని, (భగవంతుని) సృష్టివాదాన్ని సమానస్థాయి యిచ్చి బోధిస్తారు. ఇదంతా బోర్డు సభ్యుల ఆలోచనలను బట్టి జరుగుతుంది తప్ప సమాజాన్ని బట్టి విద్యార్థులను బట్టి జరగదు.

సబ్జెక్టు ప్రకారం ఉపాధ్యాయులకు సర్టిఫికెటు ఇస్తారు. గణితశాస్త్రంలో మంచి ఉపాధ్యాయుడికి ఇంగ్లీషులో మంచి వ్యాసం రాయటంరాదు. ఇంగ్లీషుభాషా ఉపాధ్యాయుడికి ఆల్జీబ్రా (బీజగణితం)లో ప్రాథమిక సూత్రాలుకూడా తెలియనవసరంలేదు. ప్రాథమిక, మాధ్యమిక పాఠశాలల్లో వర్తించే ఈ పద్ధతే కాలేజీల్లోనూ, యూనివర్సిటీల్లోనూ అమలవుతున్నది. స్పెషలిస్టులే తరగతి గదుల పాలకులు అందరూ శిక్షణ పొందిన కోతులే.

పరిశ్రమకు ఎలాంటి కార్మికులు కావాలో, ఆ ఉద్యోగాలను కార్మికులు కోరుకుంటున్నారా అన్నది ప్రజలకు తెలిసినప్పుడు వృత్తి శిక్షణ బాగానే పనిచేస్తుంది. అయితే చాలా తరచుగా ఈ సమాచారం అందుబాటులో వుండదు. అయినా విద్యఅంటే వృత్తి శిక్షణ అన్న భావం లోతుగా వేళ్లూనుకుని వుంది. అయితే యింతకు ముందు చెప్పినట్లు పెట్టుబడిదారీ వ్యవస్థలో బ్రతుకు తెరువు కొరకు సముపార్జించే జ్ఞానమూ, నైపుణ్యాలూ మానవ సంబంధాలు నెరపడంలో ఉపయోగపడవు. మానవ సంబంధాలే ప్రతి ఒక్కరి జీవనానికీ మూలాధారం.

అమెరికా సంయుక్త రాష్ట్రాలను బహుళ సంస్కృతుల సమ్మేళనంగా తరచుగా చెబుతుంటారు. కాగా బాగా అభివృదింధ చెందిన దేశాలన్నింటిలో జనాభా బహు సంస్కృతులకు చెందినవారిగా వుంటున్నారు. భిన్న సంస్కృతులు భిన్న విలువలను కలిగివుంటాయి. తరచుగా ఈ భిన్న విలువలు ఘర్షిస్తాయి; హింసాత్మకంగా బ్రద్దలవుతాయి. ఆ సాంస్కృతిక తేడాలను ప్రజలు అర్థం చేసుకుంటే, ఈ ఘర్షణలను నివారించవచ్చు. ఉపాధి శిక్షణ నిచ్చే పాఠశాలల్లో సాంస్కృతిక వైవిధ్యాన్ని బోధించేందుకూ, మన పక్కింటివారినీ, పొరుగు దేశం వారినీ అర్థం చేసుకునే ప్రయత్నానికీ అవకాశముండదు. విలువ వ్యవస్థల నెప్పుడూ సమీక్షించదు; ప్రత్యామ్నాయాల పరిశీలన జరపదు. ఫలితంగా మనమందరమూ ఈ భూమిపైనే నివశిస్తున్నప్పటికీ, మనం కలిసి జీవించటం లేదు. మహాఅయితే ప్రక్కప్రక్కన బ్రతుకుతున్నాం. లేదా అధమంగా ఒకరినొకరు చంపుకునేందుకు బ్రతుకుతున్నాం.

శిక్షణ గరిపే విద్యావ్యవస్థ ప్రతిదానినీ భావజాలానికి కుదించివేస్తుంది. మతం ఒక భావజాలం. మతాన్ని కలిగి వుండే హక్కును ఎవరూ ప్రశ్నించటంలేదు. విజ్ఞాన శాస్త్రంగా చెప్పుకుంటున్నప్పటికీ, ఆర్థిక శాస్త్రమనేది కూడా భావజాలమే. స్థాపిత పరిశ్రమ కూలిపోయినప్పుడు, కొత్త పరిశ్రమ వచ్చి, కొత్తగా నిరుద్యోగులయిన వారిని యిముడ్చుకుంటుందని స్వేచ్ఛా మార్కెట్టు ఆర్థిక భావజాలం విశ్వసిస్తుంది. కానీ అలా జరిగి తీరాలని ఆర్థిక శాస్త్రంలోని ఏ సూత్రమూ నిర్దేశించదు. ఈ విశ్వాసం క్రీస్తు మళ్లీ పుడతాడన్న విశ్వాసంతో సమానమైనదే. ఇది శుద్ధ భావజాలం. శాస్త్రం కూడా ఒక్కోసారి భావజాలమౌతుంది. ఉదాహరణకు : మన సమస్యలన్నింటికీ శాస్త్రం పరిష్కారాలను కనుగొంటుందని ప్రజలు విశ్వసిస్తారు. కానీ శాస్త్రంలో అలా నిర్దేశించే సూత్రాలేవీ లేవు. మనుషులు పర్యావరణాన్ని నాశనం చేస్తూపోతూవుంటే, దానివల్ల జరుగుతున్న హానిని సరి చెయ్యటం శాస్త్రానికి అసాధ్యమౌతుంది. భూమిపై జీవం నశించిపోతుంది. భావజాలం మనిషికి మూర్ఖత్వాన్నిస్తుంది. దాని పట్ల మన నిబద్ధత కళ్ల ముందున్న వాస్తవాన్ని చూడకుండా నిరాకరిస్తుంది.

గత తరం కంటే నేటితరం జ్ఞాన వంతం కావటానికి మనమేం చెయ్యాలి? మొత్తం మానవ ప్రపంచాన్ని, దాని చరిత్రను, మన సంస్కృతినీ, మనకు భిన్నమైన సంస్కృతులను సమగ్రంగా అవగాహన చేసుకోగల వారిగా విద్యవంతులను చేయాలి.

"దేశం నీకోసం ఏం చేసిందని అడగకు, నువ్వు దేశానికి ఏంచేసినాననీ అడుగు" అన్నందుకు జాన్‌కెనడీని పొగిడారు. ఆయనను ఖండించి ఉండకూడదా? దేశాలు ప్రజల ప్రయోజనం కోసం ఉండాలా? లేక ప్రజలు దేశ ప్రయోజనాలకోసం వున్నారా? ప్రజల త్యాగాలు అవసరమయ్యే దేశపు మంచి ఏపాటిది?

పునరుజ్జీవన కాలం నుండీ, ప్రజల ఆమోదంతో పాలన సాగించేవే సరైన ప్రభుత్వాలన్న అంగీకారం వుంది. దేశ సంస్థలూ, వ్యవస్థలన్నింటిపై పెత్తనం వున్న కొద్దిమంది లబ్ధికొరకు అత్యధిక పౌరులు జీవించి తీరాలని కుండపగలగొట్టి చెప్పిన దేశంలో జీవించటానికి ప్రజలు ఆమోదిస్తారని ఎవరైనా నిజంగా విశ్వసించగలరా? ఇది బానిసత్వం కాదా?

విశ్లేషణాత్మక ఆలోచనకూడా కొన్నిసార్లు తప్పుమార్గాలు పట్టవచ్చు. విశ్లేషణ సమస్యను తగ్గించే ధోరణికి గురవుతుంది. నిరుద్యోగులకు పని చూపించట మెట్లా అన్న ప్రశ్నకు సమాధానం చెప్పేటప్పుడు, వృత్తి శిక్షణను విద్యతో సమానం చేసే ప్రయత్నాలకు దారితీస్తుంది. కానీ దాన్ని ఆచరించబోయేటప్పటికీ, తమ విలువల వ్యవస్థను అర్థం చేసుకుని, దానిని సరిగ్గా సమీక్షించుకోగల సామర్థ్యం కొరవడిన ప్రజలను తయారు చేస్తుంది. వారు యాచక కోతులుగా లేక దీపపు పురుగులుగా మిగులుతారు. దేశ వ్యవస్థలు ప్రజల లబ్ధికొరకు ఉనికి కలిగి వుండక పోతే, ఆ తప్పు ప్రజలది కాదు; ఆయా వ్యవస్థలది.

ప్రాచీన గ్రీసులో పరిశీలనకు నోచుకొనని మానవ జీవితం జీవనార్హతను కోల్పోతుందని భావించారు. తన జీవితాన్ని పరిశీలించుకునే అవకాశాన్ని వృత్తి శిక్షణ ప్రజలకు యివ్వదు. దీనితో ప్రజలు ఎలాంటి మేధోపునాదిలేని, తరచుగా తప్పుడు దైన భావజాలంపై పూర్తిగా ఆధారపడటం సాగుతుంది. "అసత్యం తాను మాత్రమే చెడుకాదు, అది ఆత్మను కూడా చెడుతో నింపుతుంది"

మానవుల వునికి కొనసాగాలంటే వారి భావజాలాలను తీవ్ర విమర్శకు గురిచెయ్యాలి. లేదంటే గత తరం కంటే నేటితరం జ్ఞాన వంతులుగా ఏనాటికీ కాలేరు. మనలను మనం వివేకవంతులమని చెప్పుకోవటం భ్రమే అవుతుంది. N

## స్కాలర్‌షిప్స్, ఫీజు రీఎంబర్స్‌మెంట్‌లపై ఆంక్షలను ఎత్తివేయాలని విద్యార్థుల ఆందోళన

**మంగళగిరి, 21-1-12 :**

20-1-2012న సమావేశమైన మంత్రివర్గ ఉపసంఘం స్కాలర్‌షిప్, ఫీజురీఎంబర్స్‌మెంట్‌లపై పెట్టిన 14 రకాల ఆంక్షలలో భాగంగా సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులకు 25 వేలరూపాయలు మాత్రమే చెల్లించగలమని సిఫారుసు చేసింది. వీటికి వ్యతిరేకంగా పిడిఎస్ఓ ఆధ్వర్యంలో స్థానిక గాంధీబొమ్మ సెంటర్ నుండి మిద్దె సెంటర్‌వరకు విద్యార్థులు ప్రదర్శనగా వెళ్ళి రాస్తారోకో నిర్వహించి, ఆ నిర్ణయాల ఉత్తర్వు కాపీలను దగ్ధం చేశారు.

ఈ సందర్భంగా పిడిఎస్ఓ జిల్లా అధ్యక్షులు ఎస్‌కె. బాజీసైదా మాట్లాడుతూ "స్కాలర్‌షిప్ - ఫీజు రీఎంబర్స్‌మెంట్‌లపై విద్యార్థులు ఇప్పటికే అనేక రకాల ఆంక్షలతో సతమతమవుతూ వున్నారనీ, ఈ సంవత్సరం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడం కోసం అన్నిరకాల ధృవపత్రాలను స్కాన్ చేసి అందించాలని చెప్పిన ప్రభుత్వం, వాటిలో ఏ చిన్న తప్పుఉన్నా స్కాలర్‌షిప్ ఇచ్చేదిలేదని ప్రకటించి, తప్పులను సరిచేసుకోవడానికి తేదీని ప్రకటించకపోవటంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారని, కావున "ఎడిటింగ్‌డేట్"ని వెంటనే ప్రకటించాలని, మంత్రివర్గ ఉపసంఘం చేసిన ఆంక్షలను ఎత్తివేయాలని, ప్రభుత్వ కళాశాలల అభివృద్ధి కొరకై ప్రభుత్వం శ్రద్ధ చూపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్ఓ డిగ్రీకళాశాల ప్రెసిడెంట్ చంద్రశేఖర్, నాయకులు నాగూర్, బాలకృష్ణ, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక సమస్యల పరిష్కారానికై ఆందోళన

**చల్లపల్లి, 18-1-12 :**

స్థానిక చల్లపల్లి నారాయణరావు నగర్‌లో డ్రైనేజీ, రహదార్లు, మంచినీరు, కరెంట్‌వంటి సమస్యలు తక్షణమే పరిష్కరించాలని, పేదలందరికీ ఇళ్ళస్థలాలు వెంటనే ఇవ్వాలని డిమాండు చేస్తూ ఎంఆర్ఓ కార్యాలయం ఎదుట రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) చల్లపల్లి ఏరియాశాఖ ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. ఈ సందర్భంగా రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) జిల్లా నాయకులు జి. జగన్ మాట్లాడుతూ చల్లపల్లి నారాయణరావు నగర్‌లో డ్రైనేజీ, రహదార్లు వంటి మౌలిక సౌకర్యాలు కల్పించటంలో పాలకులు, ప్రభుత్వ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారనీ, ధనవంతులు నివసించే పేటలు, కాలనీల్లో పక్కారహదార్లు వేస్తున్నారనీ, ప్రజలనుండి గోళ్ళూడగొట్టి వసూలు చేస్తున్న పన్నుల ద్వారా ఆదాయాన్ని పెంచుకుంటూ పేదల కాలనీలలో సదుపాయాల కల్పనల కొరకు ఎందుకు వెచ్చించరని ప్రశ్నించారు.

రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) జిల్లా నాయకురాలు పామర్తి అంజమ్మ మాట్లాడుతూ నారాయణరావు నగర్ సత్వర అభివృద్ధి కొరకు ఆందోళనను ప్రజానీకం తీవ్రం చేయాలని పిలుపునిచ్చారు. రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) చల్లపల్లి ఏరియా కార్యదర్శి ఇ. రాంబాబు మాట్లాడుతూ నిమ్మతోట, పార్వతమ్మతోట, బయటతోటలలో మురుగు, రహదార్లు వంటి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) నాయకులు రావి సుబ్బారావు, ఎన్‌వైఎస్ నాయకులు మునిపల్లె శ్రీనివాసరావు, కుంభా రామకృష్ణ తదితరులు పాల్గొని పాలకుల, అధికార్ల నిర్లక్ష్యాన్ని ఎండగట్టారు. అనంతరం డిమాండ్లతో కూడిన మెమోరాండంను చల్లపల్లి తహశీల్దారుకు అందజేశారు. N

# జైపూర్ సాహిత్య ఉత్సవం-కుహనా లౌకికవాద రాజకీయాలు

**కొత్త** సంవత్సరం జనవరి 20వ తేదీనుండి 24వ తేదీవరకు రాజస్థాన్ రాష్ట్ర రాజధాని జైపూర్‌లో జరిగిన "జైపూర్ సాహిత్య ఉత్సవం"(జె.ఎల్.ఎఫ్.) 7వ వార్షిక సభ కాంగ్రెసు పాలకుల కుహనా లౌకికవాద తత్వాన్ని మరొకసారి బట్టబయలుచేసింది. నిషేధింపబడిన "శటానిక్ వర్సెస్" నవలా రచయిత సల్మాన్ రష్దీ రాకను వివాదాస్పదంచేసి, దాని చుట్టే మొత్తం ఉత్సవాన్ని తిప్పి చివరికి రష్దీని రాకుండా చేశారు. దీనిని ఎన్నికల రాజకీయ ప్రయోజనాలకొరకు మలుచుకున్నారు. రాష్ట్ర కేంద్ర కాంగ్రెసు ప్రభుత్వాల కుహనా లౌకిక రాజకీయాలు ఇక్కడ గూడా ప్రయోగించబడ్డాయి.

గత 6 ఏళ్ళుగా ప్రతి ఏడాదీ జనవరి 20-24 తేదీలలో ఐదురోజులపాటు రాజస్థాన్ రాష్ట్ర రాజధాని జైపూర్‌లో సాహిత్య ఉత్సవం జరుగుతోంది. జైపూర్‌ను 'పింక్‌సిటీ' అని అంటారు. అనేక రాజసౌధాల నిలయమది. 200 సంవత్సరాల పురాతనమైన "డిగ్గీప్యాలెస్" అనే రాజసౌధాన్ని అంతర్జాతీయ యాత్రికుల విలాసకేంద్రంగా ఆధునికం గావించి అందులో 2006 జనవరి నుండి ప్రతి ఏడాదీ సాహిత్యోత్సవాలు జరుపుతున్నారు. 18 మంది రచయితలు, 100మంది ప్రేక్షకులతో 2006లో ప్రారంభమైన ఈ ఉత్సవం 2007లో వివాదాస్పద రచయిత సల్మాన్ రష్దీని ఆహ్వానించటంతోనే కావచ్చు కొద్దిగా ఊపందుకుంది. అయితే ఆ సంవత్సరం రష్దీరాక వివాదాస్పదం కాలేదు. అక్కడికి హాజరైన సాహిత్యకారులకూ, పత్రికల్లో వార్తలు చదివిన వారికీ తప్ప రష్దీ రాకగానీ పోకగానీ తెలియదు. ఆ తర్వాత 2008వ సం॥లో 2500మంది ప్రేక్షకులు పాల్గొనగా, 2009లో 140 మంది రచయితలూ 12000 మంది ప్రేక్షకులూ హాజరయినారనీ, 2010 నాటికి 172 మంది రచయితలూ 30వేల మంది ప్రేక్షకులూ, 2011లో 226 మంది రచయితలూ 60వేలమంది ప్రేక్షకులూ పాల్గొన్నట్టు నిర్వాహకులు ప్రకటించారు.

ప్రస్తుతం జైపూర్ నిర్వాహకులు ఇప్పటికే ఒకసారి (2007లో) రష్దీని పిలిచి కూడా, అతని రాక వివాదాస్పదమవుతుందేమోననే జంకు లేకుండా మరొకసారి పిలిచారు. భారతదేశంలోనే అతి పెద్ద రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్‌లో ఎన్నికల ప్రచారం ముమ్మరంగా సాగుతుండగా రష్దీ జైపూర్‌కు రావాల్సి వుండింది.

## సల్మాన్ రష్దీ వివాదం ఏమిటి?

కాశ్మీరీ సూఫీ తెగకు చెందిన ముస్లిం కుటుంబంలో 1947లో సల్మాన్ రష్దీ బొంబాయి నగరంలో జన్మించాడు. తర్వాత తన 14వ ఏట చదువు నిమిత్తం లండన్ వెళ్ళి తర్వాత అక్కడే జీవిస్తున్న రష్దీ 1981లో మిడ్‌నైట్ చిల్డ్రన్ అనే నవల రాశాడు. ప్రతిష్ఠాత్మకమైనదిగా భావించే "మాన్ బుకర్" సాహిత్య పురస్కారం దానికి లభించింది. తర్వాత 1988లో వివాదాస్పద నవల "శటానిక్ వర్సెస్"ని ఆయన రాశాడు. ఇది ఆయన రచించిన నాల్గవ నవల. అందులో ఇస్లాంలో చిట్టచివరి ప్రవక్త అయిన మహమ్మద్ ప్రస్తావన తెచ్చి ముస్లింల విశ్వాసాలను గాయపడేట్టు రచించాడని ముస్లిం పెద్దలెవరో తీవ్రంగా ఆగ్రహించారు. నిజానికానవలలో రష్దీ ఏమి రాశాడో తెలియకుండానే, తెలుసుకోకుండానే ముస్లిం ప్రపంచం రష్దీపైన ఆగ్రహాన్ని వ్యక్తంచేసింది. ప్రపంచంలోనే మొదటిసారిగా, ఆ నవల వెలువడిన వారం రోజుల్లో 1988 సెప్టెంబరులో నాటి రాజీవుగాంధీ ప్రభుత్వం కస్టమ్స్ శాఖద్వారా దాన్ని భారతదేశంలో నిషేధించింది. అందులో ఆ నవలను చదవరాదనీ, ఎవరి వద్ద వుండరాదనే నిబంధనలేమీ లేవుగానీ, లండన్ లాంటి విదేశాలలో ప్రచురితమైన ఆ నవలను ఎవరూ భారతదేశంలోకి తీసుకురాకూడదనేది ఆ నిషేధపు నిబంధనగా వుంది. భారతదేశంలో నిషేధానంతరమే 14 ఫిబ్రవరి 1989లో, అనగా 23 ఏళ్ళక్రితం, ఇరాన్ దేశాధినేత, మతాధిపతి కూడా అయిన "అయొతుల్లాఖొమైనీ" ఆ నవలను నిషేధించటమేకాక దాన్ని రాసిన సల్మాన్ రష్దీకి మరణశిక్ష విధిస్తూ ఫత్వాను జారీచేశాడు. ఖొమెయినీ మరణం తర్వాత కొంత కాలానికి 1998లో రష్దీపై ఫత్వాను సడలిస్తూ ఇరాన్ పాలకులు ప్రకటించారు. రష్దీ నవల ఇస్లామిక్ దేశాలన్నిటా నిషేధింపబడలేదు. భారత దేశంలోలాగా ముస్లింలు చెప్పుకోదగిన సంఖ్యలో వున్న దేశాలన్నిటా కూడా నిషేధానికి గురవలేదు. అయినా వివిధ రకాల ఇస్లామిక్ సంస్థలు రష్దీపై ఆగ్రహాన్ని వీడలేదు. నిషేధాన్ని సంపూర్ణంగా రద్దుపరచలేదు.

## ముస్లిం పెద్దల నిరసన

2012 సాహిత్యోత్సవంలో పాల్గొనటానికి సల్మాన్ రష్దీ జైపూర్ రావటానికి స్థానిక ముస్లిం మత పెద్దలు తీవ్రంగా నిరసించారు. నిజానికి వారికి రష్దీపట్లగల ఆగ్రహానికిగల కారణమైన "శటానిక్ వర్సెస్" కు జైపూర్ ఉత్సవంతో ఎలాంటి సంబంధంలేదు. 1993లో బుకర్‌ప్రైజ్ లభించిన 'మిడ్‌నైట్ ఛిల్డ్రన్' నవలపై హరికంప్రూ అనే రచయిత నిర్వహణలో 20వ తేదీన చర్చ జరగాల్సివుంది. దానిపై శ్రోతలనుండి వచ్చే ప్రశ్నలకు రష్దీ నేరుగా జవాబులివ్వాలి. అంతేకాదు 21వ తేదీన రీటాకొఠారి, తరుణ్ తేజ్‌పాల్ (తెహెల్కా పత్రిక), ఇలా పాండేలు నిర్వహించే సభలో కూడా రష్దీ పాల్గొనాల్సివుంది. "ఇంగ్లీషు-అమ్లీషు-హింగ్లీషు" అనే అంశంపైన అనగా పచ్చడి పచ్చడవుతున్న ఇంగ్లీషు భాష (చెట్నిఫికేషన్ ఆఫ్ ఇంగ్లీషు)పైన రష్దీ చర్చలో పాల్గొనాల్సి వుంది. వివిధ యాసలుతో మాట్లాడే ఇంగ్లీషును -ఉదా॥తెలుగు వారు మాట్లాడేదాన్ని తెంగ్లీషు అనీ, హిందీ వారిది హింగ్లీషు అనీ, అమెరికావారిదయితే అమ్లీషు అనీ అంటుంటారు).

జైపూర్ సాహిత్యోత్సవానికీ వివాదాస్పద "శటానిక్ వర్సెస్" నవలకు సంబంధం లేకపోయినా "దరుల్ ఉలూమ్ దియోబంద్" అనే ముస్లిం విద్యాసంస్థ సల్మాన్ రష్దీ రాకనే నిరసిస్తూ నిర్వాహకులకు ముందుగానే విజ్ఞప్తి చేసింది. ఇది 150 ఏళ్ళ చరిత్రగల సంస్థ. భారత దేశ విభజనను (పాకిస్థాన్ వేర్పాటును) వ్యతిరేకించిన సంస్థ. ఉదార, మతసామరస్య సంస్థగా చెబుతుంటారు. కానీ ఈసారి రష్దీ జైపూర్ రాకను చూసీ చూడనట్లు వుండలేకపోయింది. నిజానికి రష్దీ గత 23 సం॥లలో అనేకసార్లు తను పుట్టిన భారత దేశానికి వచ్చివెడుతూనే ఉన్నాడు. అతనికి భారతదేశం రావటానికి "వీసా" లాంటిది అవసరం కూడా ఉండదు.

## కుహనా రాజకీయం మొదలయ్యింది

ఈసారి రష్దీ రాక ఉత్తరప్రదేశ్ ఎన్నికల ప్రచారం ముమ్మరంగా ఉన్న కాలంలో వచ్చింది కనుక, కాంగ్రేసు అధినాయకత్వమే వివాదాన్ని పెంచి పెద్దది చేసి రష్దీని రాకుండా తామే చేశామన్న చౌకబారు ఆకర్షణతో ముస్లిం ఓటర్లను ప్రసన్నం చేసుకోవాలనే పథకం వేసినట్లు పత్రికలన్నీ ఘోషించాయి. కాంగ్రేసు పార్టీ కూడా అటు కేంద్రంలో, యిటు రాజస్థాన్ రాష్ట్రంలో నాటక మాడించాల్సివచ్చింది. ముస్లీంల నిరసనకు చెవి యొగ్గుతూ, వారిని రష్దీ విషయంలో బుజ్జగించటంద్వారా ముస్లిం భావోద్వేగాలను సంతృప్తిపరచగలిగేది తానేనన్న భావాన్ని వ్యాప్తిచేయగలుగుతామనీ తద్వారా ఉత్తరప్రదేశ్ ఎన్నికలలో మెరుగైన ఫలితాలను పొందాలని ఆశిస్తోంది. దేశంలో అతిపెద్ద రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్‌లో, ఎన్నో ఏళ్ళు ఏకచ్ఛత్రాధిపత్యం వహించిన రాష్ట్రంలో ప్రస్తుతం 406 అసెంబ్లీ సీట్లలో 4వ స్థానంలోకి దిగజారిన పరిస్థితులనుండి బయటపడటానికి ఎన్ని అడ్డగోలు పద్ధతులకయినా పాల్పడటానికది సిద్ధంగా వుంది.

నిజానికి ముస్లింలందరూ గంపగుత్తగా ఒకరికే ఓటువేస్తారనే భావన వాస్తవికమైనది కాకపోయినా, వారి ఉనికికి హిందూత్వవాదులైన ఆరెస్సెస్, వారి రాజకీయ పార్టీ భారతీయ జనతాపార్టీ ప్రమాదాన్ని కలిగించే శక్తిగా వ్యవహరిస్తున్న భయోత్పాత పరిస్థితిని చూపెడుతుంది. కాంగ్రేసు పార్టీ వాడుకోదలుచుకుంది. తానే ముస్లింలకు రక్షకుడిగా, కనిపెట్టుకుని కాపాడేవానిగా నటించటం కూడా కాంగ్రేసు దాని రాజకీయ శైలిలో ఒక ముఖ్యాంశం. ముస్లింల, మొత్తం భారత ప్రజల ఆర్థిక-రాజకీయ-సామాజిక స్థితిగతుల అభివృద్ధిపైన ఏనాడూ దృష్టి పెట్టని కాంగ్రేసుపార్టీ వారిని ఆపద కాలంలో ఆదుకొంటుననట్లు నటిస్తూ వారెప్పుడూ ఆపదలోనే ఉండటాన్ని కోరుకుంటుందంటే అతిశయోక్తి కాదు. దాని ప్రజావ్యతిరేక విధానాలే జిత్తులమారీతనంతో ప్రజల్ని ప్రక్కదారి పట్టించే పనిచేస్తున్నాయి.

## రష్దీకి ప్రాణభయం కల్పించిందెవరు?

రష్దీ కనుక జైపూర్ వస్తే ప్రాణాపాయం వుందని రాజస్థాన్ పోలీసులు సాహిత్యోత్సవ నిర్వాహకులకు తెలియపర్చారు. తాము రష్దీ ప్రాణాలకు రక్షణ పూచీ వహించలేమని కూడా పక్కబెదురు పెట్టారు. ఈ విషయాన్ని నిర్వాహకుల ద్వారా రష్దీకి చేరేట్లు చేసి అతనే తన జైపూర్ రాకను రద్దుపరుచుకునేట్లు చేశారు. మహారాష్ట్రలోని నిషిద్ధ ఇస్లామిక్ విద్యార్థి సంస్థ (ఐ.ఎస్.ఐ.) నాయకుడొకరు కిరాయి హంతకముఠా మేస్త్రీతో ఒప్పందం కుదుర్చుకుని రష్దీని హత్య చేయించే పనిలో నిమగ్నమై ఉన్నట్టుగా కేంద్ర ప్రభుత్వపు పోలీసు ఇంటలిజెన్స్ విభాగంవారు సమాచారమందించినట్లు రాజస్థాన్ పోలీసులు ప్రకటించారు. కానీ పత్రికలవారు మహారాష్ట్ర పోలీసు అధికారులను విచారించగా తమకు అలాంటి సమాచారమే రాలేదని చెప్పారు. అంతేకాదు రష్దీహత్యకు కుట్రపన్నుతున్న ఇస్లామిక్ విద్యార్థి నాయకుడు, కోర్టుకు హాజరవుతూ, బెయిల్‌పైనే వున్నాడని చెప్పారు. పోలీసులు చెప్పిన కిరాయి హంతకుడు కూడా మహారాష్ట్ర పోలీసుల ముందస్తు అరెస్టుకు అందుబాటులో వున్నాడనీ, తమకు నిజంగా హత్యాయత్న సమాచారమే వుంటే ముందే అరెస్టు చేసి వుండగలిగే వారమని కూడా చెప్పారు. రాజస్థాన్ ముఖ్యమంత్రి, పోలీసు అధికారుల కథనాలకు కేంద్ర ఇంటలిజెన్స్ శాఖ, మహారాష్ట్ర పోలీసుల ప్రకటనలకు పొంతన లేకుండా పోయిందనీ, రష్దీ హత్యాపథకమనేది రాజస్థాన్ పోలీసులు అల్లిన కట్టుకథ అనీ పత్రికల వార్తలను క్షుణ్ణంగా పరిశీలిస్తే స్పష్టంగా అర్థమవుతుంది. " తనను హత్యగావించటానికి కిరాయి హంతకులు ముంబాయి నుండి జైపూర్ వస్తున్నట్లు చెబుతున్నారు. ఇలాంటి స్థితిలో నేను, నా కుటుంబం పట్ల, నిర్వాహకుల పట్ల అక్కడికి హాజరయేవారి పట్ల బాధ్యతారహితంగా ప్రవర్తించలేను. కనుక నేను జైపూర్ రాను" అని రష్దీనే ప్రకటించినట్లు నిర్వాహకులు చెప్పారు.

## సల్మాన్ రష్దీనే ఎందుకు పిలవాలి?

రష్దీ 1975 నుంచి నేటి దాకా 9 నవలలు 15 యితర గ్రంథాలు (కథలు-బాలసాహిత్యం-చరిత్ర-మత తాత్విక గ్రంథాలు) రచించాడు. అనేక రకాల 'సాహితీ' పురస్కారాలందుకున్నాడు. కానీ భారత ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఛైర్మన్-జస్టిస్ మార్కండేయ కట్జూ ప్రకారం రష్దీ రచనలు ప్రామాణికమైనవికావు. 'శటానిక్ వర్సెస్' నవల నిషేధానికి గురికావటమూ, రష్దీపైన చంపుతామనే ప్రతిజ్ఞలు వుండడం చేతనూ అతను ఎక్కువ ప్రాచుర్యంలోకి వచ్చాడు. కానీ సాహిత్య ప్రమాణాల ముందు నిలువదగ్గ రచనా సమర్థత ఉన్నవాడు కాదు. కానీ తిరిగి తిరిగి అతనినే మళ్ళీ జైపూర్ సాహిత్య ఉత్సవానికి అతనినెందుకు పిలవాల్సి వచ్చిందని నిర్వాహకులను అడిగిన వారే కనబడటంలేదు. నిజంగా రష్దీ సాహిత్యపు విలువలపట్ల అంత గౌరవమే నిర్వాహకులకు ఉంటే అతని "శటానిక్ వర్సెస్" నవలను ప్రపంచంలోనే అందరికన్నా ముందు నిషేధించిన రాజీవుగాంధీ ప్రభుత్వాన్నీ, కాంగ్రెసు పాలకుల్నీ నిగ్గదీయాలికదా! దానిపై వున్న నిషేధాన్ని తొలగించమని రాష్ట్ర, కేంద్ర కాంగ్రెసు పాలకుల్ని డిమాండు చేసి వుండాలికదా!

ఎకనమిక్‌టైమ్స్ పత్రిక జనవరి 18న ఇలా రాసింది "ఈ రోజు ఉదయం రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లోట్ కేంద్రహోంశాఖామంత్రి పి. చిదంబరంను రష్దీ రాక విషయాన్ని చర్చించటానికి కలిశాడు. కాంగ్రెసు ప్రభుత్వం రష్దీ జైపూర్ రాకను ఆపివేయటానికి జరిపే ప్రయత్నంలో భాగమిది అన్నట్లు వార్తలు బయటకు పొక్కాయి. రష్దీ రాకవల్ల ముస్లింల భావోద్వేగాలు గాయపడి త్వరలో జరగనున్న వివిధ రాష్ట్రాల ఎన్నికలలో -ముఖ్యంగా ఉత్తర ప్రదేశ్‌లో-తమకు నష్టం కలిగిస్తుందని కాంగ్రెసు వర్గాలు బలంగా అభిప్రాయపడుతున్నాయి"

నిజానికీ విషయంలో కాంగ్రెసు పార్టీ ఒక్కటే కాదు, సమాజ్‌వాదీ పార్టీ, బహుజనసమాజ్‌పార్టీ, భారతీయ జనతాపార్టీకూడా రష్దీని రాకుండా చేయమనే ప్రభుత్వాన్ని కోరాయి. అయితే కాంగ్రెసు పార్టీ మొదటి నుండీ కుదిరితే లౌకికవాద ముసుగునీ, కుదరకపోతే 'మతం' ఓట్లకొరకు బుజ్జగింపు రాజకీయాల్నీ నడుపుతూనే వుంది. రష్దీలాంటి వివాదస్పద రచయిత కాంగ్రెసుకు అచ్చివచ్చాడు.

## రష్దీ రాకపై ఆంక్షలచుట్టూ రచయితలు

రాజస్థాన్‌లో 'పౌరపరిపాలనా విద్యాసంస్థ' (ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎడ్మినిస్ట్రేషన్) మాజీ ఆచార్యునిగా పనిచేసిన, ముస్లిం మేధావిగా గుర్తింపుగల ప్రొఫెసర్ ఎం. హసన్ యిలా అన్నారు "రష్దీ రాక పట్ల ముస్లిములలో వ్యతిరేకతకు ముఖ్యకారణం తప్పుడు సమాచారంపై ఆధారపడివుంది. రష్దీ రాకను ముస్లిములు నిరసించవచ్చు. కానీ యివన్నీ రాజస్థాన్‌లో ముస్లిము లెదుర్కొంటున్న మౌలిక సమస్యలనుండి పక్కదారి పట్టించేవే! జైపూర్ ముస్లిములు తమ ప్రాధాన్యతల నెరిగి వుండాలని ఆశిస్తున్నాను. ఉత్తరప్రదేశ్‌లో జరగనున్న ఎన్నికలకు దీనితో ఏదో గట్టి సంబంధం వున్నదని నాకనిపిస్తోంది"

జైపూర్ సాహిత్య ఉత్సవం రష్దీ రావటం, రాలేక పోవటం చుట్టూ తిరిగింది. నిషేధిత "శటానిక్ వర్సెస్" గ్రంథంలోని కొన్ని భాగాలను 20వ తేదీన పాల్గొన్న నలుగురు రచయితలు బహిరంగంగా సాహిత్యోత్సవంలో చదివి వినిపించారు. రష్దీపై ఆంక్షలకు తమ నిరసనగా చెప్పుకున్న వీరు, పోలీసులు అరెస్టు చేస్తారేమోననే భయంతో ఆ పూటే జైపూర్‌ను వీడిపోయారు. తమ నిరసన, ఒత్తిళ్ళనెదుర్కొనే సాహసంతో కూడినదిగా వ్యక్తం చేయలేకపోయారు. పియుసిఎల్ ( పీపుల్స్ యూనియన్ ఫర్ సివిల్ లిబర్టీస్) రాజస్థాన్ శాఖ కూడా రష్దీని రాకుండా చేసినందుకు నిరసన వ్యక్తం చేసింది. అనేక యితర రచయితలు పత్రికా సంపాదకులు కూడా నిరసించారు. మీడియా అంతా రష్దీదే ప్రధాన సాహిత్య సమస్యగా చిత్రీకరిస్తూ కథనాలపై కథనాలు ప్రచురించాయి.

ఇంకా అనేక యితర అంశాల చుట్టూ ఉదా॥ పాలస్తీనా సమస్య దగ్గర నుండి "దేవుడు-మనిషి" (రిచర్డ్ కిన్స్) దాకా కొన్ని ఆసక్తికరమైన చర్చలు జరిగాయి.

అయితే సాహిత్యోత్సవంలో రచయితలూ-సాహిత్యమే ప్రధానపాత్ర వహించలేదు. ఆకాశ్ కపూర్ అనే జర్నలిస్టు ప్రకారం "జైపూర్ సాహిత్య ఉత్సవాలకు ముఖ్యంగా 'సెలబ్రిటీ'లవల్ల ఆకర్షణీయం చేయడం వల్ల ఎక్కువమంది హాజరయారని చెప్పవచ్చు. ఆప్రా విన్ ఫ్రే లాంటివారే కాక బాలీవుడ్ 'తార'లు కూడా ఉపన్యాసకులుగా ఉండటం వల్ల కూడా వచ్చారు. సాహిత్యం పట్ల నిజమైన ఆసక్తిగలవారు తమకెదురైన పుస్తకాలే కాక వాటి రచయితలను కూడా చూడటం, వినటం అనే సందర్భాన్ని ప్రత్యక్షంగా పాల్గొనటం ద్వారా సాధ్యపడటం కూడా ఒక కారణంగా చెప్పవచ్చు"

5 కోట్ల రూపాయల ఖర్చుతో నిర్వహించిన ఈ సాహిత్యోత్సవంలో లక్షలాది రైతుల ఆత్మహత్యల వెనుక గల జీవన సంక్షోభాల్ని గానీ, కోట్లాది నిరుద్యోగుల దీనాలాపనల ప్రకంపనలుగానీ, కడుపు కక్కుర్తికి వ్యభిచారకూపాల్లోకి గుంజివేయబడుతున్న 'పవిత్ర' భారత మహిళల ఆక్రందనలుగానీ, సెజ్‌ల పేరిట భూముల నుండి, గ్రామాల నుండి బేదఖలు గావింపబడుతున్న గ్రామీణ ప్రజల హాహాకారాలుగానీ....ఒక్కమాటలో గత 20 ఏళ్ళుగా సామ్రాజ్యవాద ప్రపంచీకరణ పేరుతో సామాజిక సంక్షోభాన్ని, సాంస్కృతిక క్షీణవిలువల్నీ భయంకరంగా వ్యాప్తిచేసిన భారత పాలకుల ఆర్థిక, రాజకీయ విధానాల దుష్ఫలితాలను వాటిని సాహిత్య కళా రూపాలలోకి ప్రతి బింబించలేక పోతున్న స్థితి-గతులను చర్చించే వేదిక కాలేకపోవటం ఎంత మాత్రం మనకు ఆశ్చర్యాన్ని కలిగించదు. కాక పోగా ప్రజల వాస్తవిక జీవన సమస్యలను పక్కదారి పట్టించే గంభీరోక్తులకు అవి నిలయాలుగా ఉంటాయి. అలాంటి సందర్భాలకు సల్మాన్‌రష్దీలాంటివాళ్ళు కరివేపాకులా వారికి ఉపయోగపడతారు.

భారత పాలకుల కుహనా లౌకిక విధానాలను, ప్రజావ్యతిరేక సాహితీ సాంస్కృతిక తత్వానికీ ప్రతిబింబంగా జైపూర్ సాహిత్యోత్సవం నిలిచిపోతుంది. N

# లక్ష్మమ్మగారి సంస్మరణ సభ

**రాయదుర్గం:, 28-1-12:**

రైతుకూలీసంఘం (ఆం.ప్ర) అనంతపురం జిల్లా కార్యదర్శి కా॥బి.తిమ్మారెడ్డిగారి భార్య, విశ్రాంత ఉపాధ్యాయురాలు శ్రీమతి ఎ.లక్ష్మమ్మ ఇటీవల మరణించారు. ఆమె సంస్మరణ సభ స్థానిక టీచర్స్ కాలనీలో జరిగింది.

ఈ సభలో రైతుకూలీసంఘం(ఆం.ప్ర) రాష్ట్ర కార్యదర్శి కా॥కె.కోటయ్య మాట్లాడుతూ ప్రజా ఉద్యమాలకు శ్రీమతి లక్ష్మమ్మ అందించిన సహకారాన్ని గుర్తు చేసుకుంటూ నివాళులర్పించారు. గత 30 సం॥లుగా వారి కుటుంబంతో తనకున్న పరిచయాన్ని, ప్రజా సమస్యల పరిష్కార కృషిలో నిరంతరం శ్రమించే కా॥తిమ్మారెడ్డికి ఆమె అందించిన తోడ్పాటును కొనియాడారు. ఏఐఎఫ్‌టియు (న్యూ) రాష్ట్ర అధ్యక్షులు కా॥సి.పెద్దన్న మాట్లాడుతూ తాను చేసిన తోడ్పాటుకు ఏలాంటి ప్రచారాన్నీ ఆశించని ఆమె వ్యక్తిత్వాన్ని గుర్తుచేశారు. శ్రీమతి లక్ష్మమ్మ సహ ఉపాధ్యాయని ఉమాదేవి, బళ్ళారి అడ్వకేటు మల్లిఖార్జునరెడ్డి, నవయువ సమాఖ్య నాయకులు కా॥లక్ష్మీరెడ్డి, తదితరులు ఈ సభలో ప్రసంగిస్తూ ఆమెకు జోహార్లర్పించారు. N

# జూనియర్ డాక్టర్ల సమ్మె - కొన్ని పరిశీలనాంశాలు

ఎం.ఎల్.సి. నాగేశ్వర్ మధ్యవర్తిత్వంతో జూనియర్ డాక్టర్లకూ ప్రభుత్వానికీ మధ్య చర్చలు జరిగి జూనియర్ డాక్టర్లు సమ్మె విరమించారు. 40 రోజులకు పైగా సాగిన సమ్మె ప్రభుత్వ వైద్యశాలలపై ఆధారపడే పేదలకు నానాయిబ్బందులూ కలిగించినా పట్టించుకోని ప్రభుత్వం, వైద్యులు అత్యవసర సేవలను అందించటం ఆపివేయగానే కదిలింది. పేదలకు వైద్యసేవలందక పోవటానికి సమ్మె చేస్తున్న వైద్యులే కారణంగా చిత్రించింది. హెచ్చరికలకూ, బెదిరింపులకూ పూనుకుంది. వైద్యం అందక పేదలు గగ్గోలు పెడుతున్నా, మరణాలకు దారితీసినా సేవలందించేందుకు అన్ని ఏర్పాట్లూ చేశానని బింకాలు పోయింది. ఈ సమ్మె అనేక ముఖ్యాంశాలను ముందుకు తెచ్చింది. వీటిని లోతుగా పరిశీలిస్తే తప్ప రాష్ట్రంలో వైద్య ఆరోగ్య సేవలు ఎంత దిగజార్చబడిన స్థితిలో వున్నాయో తెలియదు.

### జూనియర్ డాక్టర్ల డిమాండ్లు ఏమిటి?

తమకు చెల్లించే ఉపకారవేతనాన్ని నెలనెలా చెల్లించాలనీ, దానిని పెంచాలన్నది వారి డిమాండ్. 2009లో ఉపకారవేతనాన్ని నిర్ణయించినా వాటిని నెలనెలా చెల్లించటం లేదు. హైదరాబాదులోని వారు ఆఫీసులచుట్టూ తిరిగితే మూడు నెలల కొకసారి యిస్తున్నారు. ఇతర ప్రాంతాలవారికి ఆరు నెలలకొకసారి యిస్తున్నారు. ఇది ప్రభుత్వం సులభంగా పరిష్కరించగల సమస్య. ఎన్నిసార్లు విజ్ఞప్తులు చేసినా రెండేళ్లుగా ప్రభుత్వం పరిష్కరించేందుకు పూనుకోలేదు.

అత్యవసర సేవల విభాగంలో సూదులు, మందులు, గ్లౌజులు వంటివి కూడా అందుబాటులో ఉండక వైద్య మందించటం ఆలస్యమౌతున్నందున ఈ విభాగాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నది రెండవ డిమాండ్. నిరంకుశాధికార యంత్రాంగం రూపొందించే నిబంధనలు అత్యవసర వైద్యమందించటానికి ఆటంకంగా వున్నందున వాటిని మార్చమన్నదే దీనిసారాంశం. ఇలాంటిదే మూడవ డిమాండ్. మధ్యాహ్నం తర్వాత మర్నాటి ఉదయం వరకూ పరీక్షలు చేసే ల్యాబులు మూసివుండి, పరీక్షలను చేయించుకొమ్మని బయట ప్రైవేటు కేంద్రాలకు పంపాల్సి వస్తున్నదనీ కనుక ల్యాబును 24 గంటలూ తెరచివుంచాలని డిమాండ్ చేశారు. ఇలా చేయటం ప్రభుత్వ కనీస విధి. తాను చేయకపోగా వైద్యులు కోరినా పట్టించుకోకపోవటం ప్రజారోగ్యం పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని తెలుపుతున్నది.

వైద్యుల మిగిలిన డిమాండ్లు కూడా సరైనవే. ఈ వైద్యులు విద్యార్థులుగా విద్యా సముపార్జనకు కావలసిన సౌకర్యాలు ఏర్పాటు చెయ్యమని కోరేవి. మంచి గ్రంథాలయం, వాటిలో ఆధునిక వైద్య ప్రక్రియలను తెలిపే శాస్త్రరంగ పత్రికలు అందుబాటులో వుంచాలి వంటి పది డిమాండ్లు వున్నాయి. వైద్య విద్య కొరకు ప్రభుత్వం ఖర్చుపెడుతున్నందున గ్రామీణ ప్రాంతంలో సేవలందించాలని వాదిస్తున్న ప్రభుత్వం, ఆ వైద్యులు నిపుణులుగా, ఆధునిక ప్రక్రియలు తెలిసినవారిగా రూపొందేందుకు తగిన ఏర్పాట్ల పట్ల నిర్లక్ష్యం వహించటం గర్హనీయం.

ఎక్కువ వివాదాస్పదంగా వున్న అంశం - గ్రామీణ ప్రాంతాల్లో వైద్యులు తప్పనిసరిగా వైద్య సేవలందించాలన్నది. డిగ్రీ, పిజి, సూపర్‌స్పెషాలిటి మూడు స్థాయిల్లోనూ మూడేళ్ల గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తేనే డిగ్రీ పొందటానికి వైద్యులు అర్హత పొందుతారని ప్రభుత్వం వాదన. వైద్యశాఖలో వైద్యుల ఖాళీలను భర్తీచేయటంలేదు. ఇటీవల కాంట్రాక్టు పద్ధతిలో నియమిస్తున్నా, అది కావలసిన వైద్యులలో కొద్దిమంది మాత్రమే. ప్రభుత్వ సర్వీసులో వున్న వారిలో కూడా పలుకుబడి కలిగినవారిని నగరాలకు పంపుతున్నారు. ఇక గ్రామీణ ప్రాంతాల్లోని వైద్యశాలలను పాతశాలల్లాగే అధోగతి పాల్జేశారు. కనీస సదుపాయాలు కూడా లేకుండా చేశారు. వైద్య సేవలందించే బాధ్యత నుండి ప్రభుత్వం తప్పుకోవాలన్న నూతన ఆర్థిక విధానాల్లో భాగంగానే ప్రభుత్వం వైద్యరంగాన్ని నిర్లక్ష్యం చేసింది. ఆరోగ్యశ్రీ పథకాలతో ప్రైవేటు ఆస్పత్రులకు ప్రభుత్వ నిధులను కట్టబెడుతున్నది. ఈనాటివరకూ ఆరోగ్యశ్రీకి ఖర్చు పెట్టిన నిధులతో ప్రతిజిల్లాలోనూ రెండు బోధనా ఆస్పత్రులను నెలకొల్పగలిగి వుండేది. ఇప్పుడు ఏడాదికి ఖర్చు పెడుతున్న దానిలో సగం డబ్బుతో వాటి నిర్వహణ చేయగలిగేది. అలా జరిగివుంటే ఆరోగ్యశ్రీ క్రిందకు వచ్చే కొన్నిరకాల వ్యాధులకే కాకుండా, అన్నిరకాల జబ్బులకూ ప్రజలందరికీ ఉచితవైద్యం అందివుండేది. ఇవికాక ఆస్పత్రులలోని కొన్ని విభాగాలను ప్రైవేటీకరిస్తున్నది. మందులు, లాబ్ పరీక్షలకు యూజర్‌ఛార్జీల పేరిట రోగులను కొనుక్కో మంటున్నది. గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలందక పోవటానికీ, ఆమాటకొస్తే పట్టణాలు, నగరాల్లో కూడా వైద్య సేవలందక పోవటానికీ ప్రభుత్వ విధానమే కారణమన్నది నిర్వివాదం. కానీ గ్రామీణ ప్రాంతాల్లో పనిచేయటానికి నిరాకరిస్తున్నారంటూ తప్పంతా జూనియర్ డాక్టర్ల మీదకూ, వైద్యుల మీదకూ నెట్టడానికి పూనుకుంది. ఈ వాదనతో సమ్మెచేస్తున్న వారిపై ప్రజల్లో సానుభూతి రాకుండా చేద్దామన్న ఆలోచన తప్ప గ్రామాలలో ప్రజలకు మూర్తిస్థాయి వైద్యసేవలందించాలన్న చిత్తశుద్ధి ప్రభుత్వానికి లేదు. (వాదన కొరకు మాత్రమేయిది. ప్రతి సేవ విలువ, లభ్యతలను స్వేచ్ఛా మార్కెట్టు శక్తులే నిర్దేశిస్తాయన్న సిద్ధాంతాన్ని ప్రతి అంశానికీ వర్తింప చేస్తున్న ప్రభుత్వం ఆ వాదన డొల్లతనాన్ని యిప్పటికైనా గుర్తిస్తుందా? తాను చేసే సేవకు ఎక్కువ మూల్యం చెల్లించే ప్రాంతాన్ని, ప్రైవేటురంగాన్ని వైద్యులు ఎంచుకుంటే ప్రభుత్వం వారినెలా తప్పుపడుతుంది).

దీనికి రెండవ పార్శ్వాన్ని కూడా చూడాలి. గ్రామీణ ప్రాంతాల్లో పనిచేయటానికి జూనియర్ డాక్టర్లు ఒక సంఘంగా ఏనాడూ తిరస్కరించలేదు. దానిమూలంగా ఏర్పడే యిబ్బందులను సరిచేసే విధంగా నియమ నిబంధనలు రూపొందించమనే అడుగుతున్నారు. ఉదా: ప్రభుత్వ వైద్యకళాశాలల్లో చదివిన వైద్య విద్యార్థులు గ్రామాలలో పనిచేస్తుంటే, ప్రైవేటు కళాశాలల్లో చదివిన ధనిక కుటుంబాలవారు ఉన్నత విద్యలో సీట్లు పొందుతారు. అలాగే ఇతర రాష్ట్రాలలో చదివినవారు కూడా. ఇది న్యాయమైన, పరిష్కరించవలసిన సమస్య.

అయితే వ్యక్తులుగా జూనియర్ వైద్యులలోనూ, అసలు వైద్యరంగంలోని వారిలోనూ గ్రామీణప్రాంతాల్లో పనిచేయటం పట్ల అయిష్టత వున్నదన్నది వాస్తవం. దాదాపు పుష్కరకాలంపాటు శిక్షణ పొందిన వైద్యులు అంతకంటే చాలా తక్కువకాలం శిక్షణ పొందిన ఇతరరంగాల్లోని నిపుణులు పొందుతున్న సౌకర్యాలతో పోల్చుకుని, తాము వాటికన్నా అధిక సౌకర్యాలు పొందటానికి అర్హులమని భావించటమే దీనికి కారణం. అమెరికా, యూరపు దేశాలలో వైద్యరంగంలోకి రాకుండా ఇతర రంగాల్లోకి అక్కడి ప్రజలు వెళ్లటానికి ఈ సౌకర్యాలూ, వైద్య విద్య ఖరీదే కారణం. అమెరికాలో భారత వైద్యులు ప్రముఖ స్థానంలో ఉండటానికి కారణం - అమెరికా ప్రజలు బద్ధకస్తులో, కష్టపడేస్వభావం లేనివారో కావటంకాదు; తక్కువ ఖర్చుతో ఎక్కువ సౌకర్యాలు పొందే ఇతర రంగాలను ఎంచుకోవటమే! తమ సేవలకు ఎక్కువ మూల్యం చెల్లించాలన్న భావన గతంకన్నా నూతన ఆర్థిక విధానాల అమలు తర్వాత వైద్యరంగంలో మరింత పెరిగింది. పోటీని పూజించే పెట్టుబడిదారీ వ్యవస్థ మానవ సంబంధాలనూ, మానవీయ భావనలనూ ఎంతగా వికృతపరుస్తుందో ఇది తెలుపుతుంది.

వైద్యరంగం సేవాభావంతో నిండివుండాలి. తమ వృత్తిరీత్యా వైద్యులు మూల్యం పుచ్చుకున్నా, ఆర్థికంగా బలహీనవర్గాలపట్ల తమ బాధ్యతను గూడా గుర్తించాలి. అన్ని వృత్తులలో వుండేవారికీ సామాజిక బాధ్యతవుండాలి. వైద్యరంగంలో యిది మరింత ఎక్కువగా ఉండాలి. దీనిని ప్రోత్సహించే విధంగా వైద్య విద్యలో బోధన వుండటం లేదు. పైపెచ్చు ధనికులు మాత్రమే ప్రవేశించగల ప్రవేటు వైద్య కళాశాలలను పెంచుతూ లాభార్జనే ధ్యేయంగా ప్రభుత్వం వైద్యరంగాన్ని మార్చుతున్నది.

గ్రామీణ ప్రాంతాల్లో పనిచేయటానికి సంఘంగా నిరాకరించకపోయినా, వ్యక్తులుగా వైద్యులకున్న అయిష్టతను వదులుకోవాలి. ఎం.బి.బి.ఎస్. పూర్తికాగానే తమను వైద్యులుగా నియమించమనీ, కొంతకాలం పనిచేసిన తర్వాత పిజి చదువుకొనేందుకు అవకాశమివ్వమని వారు డిమాండ్ చేసి వుండాల్సింది. దీనితోపాటు గ్రామీణ వైద్యశాలల్లో పూర్తిసౌకర్యాలు కల్పించమన్న డిమాండ్ చేస్తే బాగుండేది. అప్పుడు గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సౌకర్యాల అందుబాటుకు కారణంగా చూపుతున్న వైద్యుల కొరతను తీర్చేందుకు ముందుకు వచ్చేదో లేదో తేలేది.

ఇలాంటి వైఖరి తీసుకోకుండా ప్రభుత్వం, నిర్బంధ సర్వీసంటూ వైద్యులలో అయిష్టతను పెంచేందుకు పూనుకుంది. అందుకే అది సమ్మె మొదలైన నాటినుండి జూనియర్ వైద్యుల డిమాండ్లను వక్రీకరించడానికి పూనుకుంది. గ్రామీణ ప్రాంతాల్లో పనిచేయటానికి నిరాకరిస్తున్నారనీ, శిక్షణ పొందుతున్నవారికి పూర్తి వైద్యునికిచ్చే వేతనమిమ్మంటున్నారనీ, రోగులకు మెరుగైన సేవలందించేందుకు మౌలిక సదుపాయాలు కల్పించ మనటాన్ని తమకు ఎక్కువ సౌకర్యాలడుగుతున్నారనీ- పలు విధాలుగా వక్రీకరించింది. ఇంతేకాక కుటిల ప్రయత్నాలను కూడా చేసింది. హైదరాబాద్‌లో సమ్మెకు నాయకత్వం వహిస్తున్న వారు అగ్రవర్ణాల వారుగనుక ఇతర ప్రాంతాలవారు సమ్మె ఆపివేయండంటూ స్వయంగా మంత్రిగారే ఫోన్‌చేసి చిచ్చుపెట్టపూనుకోవటం; ఎప్పుడూ ప్రభుత్వానికి కొమ్ముగాసే డాక్టరు రమేష్‌తో తెలంగాణా వైద్యుల సంఘమన్న దానిని పుట్టించి, జూనియర్ డాక్టర్లపైకి దాడికి పంపించి ప్రాంతీయ విభేదాలు రెచ్చగొట్టచూడటంవంటి సమ్మె విచ్ఛిన్న చర్యలకు పూనుకున్నది. ఇది ప్రభుత్వ ప్రజావ్యతిరేక నిరంకుశ స్వభావాన్నే తెలుపుతున్నది. తన అదుపులోని పత్రికలు, టి.వి. ఛానళ్ల ద్వారా సమ్మెవల్ల వైద్యమందక రోగులు మరణాల పాలవుతున్నారని ప్రచారం చేయిస్తూనే, ఈ మరణాలు ఎప్పుడూ ఉండేవేననీ వైద్య సేవలందించేందుకు అన్ని ఏర్పాటూ చేశామని అసత్య ప్రకటనలు చేసింది. అయినా ఈ నిర్హేతుక వైఖరితో ప్రభుత్వ ఆస్పత్రులలో మరణాలు అధికంగా వున్నాయని అన్యాపదేశంగా అంగీకరించింది.

ప్రభుత్వ ఈ కుట్రలను జూనియర్ వైద్యులు సంయమనంతోనే అధిగమించారు. ఏమైనా చివరకు జూనియర్ వైద్యుల డిమాండ్లను ప్రభుత్వం సూత్రరీత్యా అంగీకరించింది. వ్రాతపూర్వక హామీని కోరిన వైద్యులు మంత్రిగారు సంతకం చేయకపోయినా చర్చలలో అంగీకరించి దానితో సంతృప్తిచెంది సమ్మెను విరమించారు. పేద రోగులకు ఊరటనివ్వాలన్న అంశమే వారిని దీనికి పురికొల్పటం అభినందనీయం. ఈ ఆర్ద్రతనే వారు కొనసాగిస్తారని ఆశిద్దాం. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా తాత్సారం చేసి మళ్లీ వైద్యులు సమ్మెకు దిగే పరిస్థితి కల్పించరాదనీ, ఆ విధంగా అందుబాటులో వున్న కొద్దిపాటి వైద్యసౌకర్యాలను కూడా ప్రజలకు నిరాకరించరాదని ప్రభుత్వాలపై వత్తిడి తెద్దాం. వైద్యసేవలందించే బాధ్యత నుండి తప్పుకొనే ప్రభుత్వ విధానాన్ని మార్చేందుకు పూనుకోవటం మన ముందున్న కర్తవ్యం.

N

# విదేశీ, స్వదేశీ పెట్టుబడిదారుల ఖాతాకు భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ నిధి తరలింపుకు చర్యలు

**కార్మిక** సంక్షేమ చర్యలు చేపట్టటంలో పాలక పార్టీలు-ఎవరికివారు, తామంటే తామే ఛాంపియన్లమని గప్పాలు కొట్టుకోవటాన్ని ప్రతిరోజూ గమనిస్తూనే వున్నాం. కానీ వాస్తవానికి కార్మికులు-తమ జీవన పరిస్థితుల మెరుగుకోసం, పనిభద్రతకోసం, పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలకోసం, రక్షణ పరికరాల ఏర్పాటుకోసం ఎన్నో పోరాటాలు సాగించి సాధించుకున్న హక్కులను, చట్టాలనుకూడా అమలు చేయకుండా పాలకులే గుంజివేసుకుంటున్నారనేది నిర్వివాదాంశం. ప్రజలందరి మనుగడకు అవసరమైన ఆహారాన్ని ఉత్పత్తి చేసే రైతాంగం పట్ల అనుసరిస్తున్న దోపిడీ విధానాలనే, ప్రజలందరికీ అవసరమైన సమస్త సరుకులనూ ఉత్పత్తి జేసే, వివిధ రకాల సేవలనందించే సమస్త కార్మికుల పట్లనూ వీరిలో భాగంగా ఎన్నో కట్టడాలను నిర్మించే భవన నిర్మాణ కార్మికులపట్లనూ అనుసరిస్తూ వస్తున్నారు. స్వదేశీ, విదేశీ బడా సంపన్న వర్గాల, నిరంకుశ యాజమాన్యాల కొమ్ముకాస్తూ భవననిర్మాణ కార్మికుల పట్ల అమానవీయంగా, ఘోర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

యావన్మంది కార్మికులలో-8 గంటల పనిదినం, కనీస వేతనం, సెలవులు, ఇంక్రిమెంట్లు, బోనస్‌లు, గ్యాట్యుటీ, ప్రావిడెండ్‌ఫండ్, పెన్షను, ఇఎస్ఐ తదితరమైనవి అమలు చేయబడుతున్నాయని చెప్పే, సంఘటిత రంగంగా పిలవబడే దానిలో కార్మికుల సంఖ్య అత్యల్పమైనదికాగా, కార్మికులలో నూటికి 95 మంది పైగా సంఘటితేతర రంగంలో అంటే చట్టబద్ధంగా పైన పేర్కొన్న సౌకర్యాలేమీ లేకుండా తీవ్రమైన శ్రమదోపిడీకి, ఆర్థిక దోపిడీకి గురౌతున్నారు.

సంఘటితేతర రంగంలోని ఒక విభాగమైన భవన నిర్మాణ రంగంలో కార్మికుల సంఖ్య-నూతన ఆర్థిక విధానాల అమలు తదనంతర కాలంలో -'90ల తర్వాత-గణనీయంగా పెరుగుతూ వస్తున్నది. వీరిపై అమలవుతున్న అత్యధిక శ్రమదోపిడీ విధానాలు, లాభార్జనే ధ్యేయంగా అతితక్కువ వేతనాలతో కార్మికులను పీల్చి పిప్పిచేస్తున్న యాజమాన్యాలు, పని ప్రదేశాల్లో కనీసపాటి రక్షణ ఏర్పాట్లు కల్పించక పోవటాలు, కట్టడాల డిజైనింగ్‌లోనూ, నిర్మాణాల నాణ్యతలోనూ లోపాల వంటివన్నీ కలగలిసి భవన నిర్మాణ కార్మికుల జీవనాన్ని బహుదుర్భరం చేస్తున్నాయి.

గత సంవత్సరం దేవాదుల సొరంగమార్గ నిర్మాణంలో ముగ్గురు కార్మికులు మరణించారంటున్నా ఆ సంఖ్య ఇంకా ఎక్కువగానే వుంది. పెద్దకట్టడాల సందర్భంగా క్రేన్ల వైర్లు తెగిపడి పైనుండి జారిపడి, ప్రమాదాలు సంభవించి నిర్మాణ కార్మికులు మరణిస్తున్న వార్తలను రోజూ చూస్తూనే వున్నాం. రాలివాగుప్రాజెక్టు (ఆదిలాబాద్‌జిల్లా) నిర్మాణ సందర్భంగా ఒకేసారి 12 మంది కార్మికులు మరణించారు. ఇందులో చిన్నపిల్లలు కూడా ఉన్నారు. గాలేరు నగరి సొరంగమార్గం నిర్మాణాల్లోనూ 50 మందికి పైగా మరణించినట్లు అధికారులే పేర్కొన్నారు. ఫ్లైఓవర్లు, ఓవరు బ్రిడ్జిలు, విమానాశ్రయాలు, మెట్రో రైల్వేలైన్లు, లిఫ్టుపనుల్లో మరెందరో అనునిత్యం పనిప్రదేశాలలోనే దుర్మరణాల పాలౌతుండగా, అనేకులు అంగవికలురౌతున్నారు. ఈ పరిస్థితులకు వ్యతిరేకంగా భవన నిర్మాణ కార్మికులు వివిధ రూపాల్లో తమ ఆగ్రహాన్ని, అసంతృప్తిని ఆందోళనలు, నిరసనల ద్వారా వ్యక్తం చేస్తూ, పాలకులను నిలదీస్తూ వస్తున్నారు.

చట్టప్రకారంగానైనా కార్మికులందరికీ కల్పించ వలసిన ఏ విధమైన కనీసపాటి రక్షణలనూ కల్పించకుండా చోద్యం చూస్తున్న పాలకులే భవన నిర్మాణ కార్మికుల నుండి వస్తున్న వత్తిడులకు తలొగ్గి, తమఎన్నికల ఓట్ల రాజకీయాలతోజోడించి భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసమంటూ 1996లో ఒక చట్టాన్ని రూపొందించారు. (సంఘటిత ఉద్యమాల ద్వారానే భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ చట్టం అమలు సాధ్యం'.. 5-4-2011 'జనశక్తి' చూడండి)

ఈ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ చట్టమనేది భవన నిర్మాణ కార్మికుల కళ్ళ నీళ్ళు తుడవటానికి, వారిని మభ్యపరచటానికి తీసుకొచ్చిన మరో చట్టమేనని దాని ఆచరణ, అమలు తీరు ద్వారా కూడా స్పష్టమౌతున్నది. అందులో భాగంగానే కేంద్రంలో అధికారంలో నున్న ప్రభుత్వంకూడా ఈ చట్టాన్ని అమలు చేయటానికి అవసరమైన మార్గదర్శకాలను నిర్దిష్టంగా రూపొందించకుండా, రాష్ట్రాలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయకుండా దశాబ్దకాలంపైగా తాత్సారం చేసింది. ఎట్టకేలకు మార్గదర్శక సూత్రాలను రూపొందించి, ఆయా రాష్ట్రాలకు పంపినా వాటి అమలును పర్యవేక్షించకుండా ఉద్దేశ్యపూరిత నిర్లక్ష్యం వహించింది. మనరాష్ట్ర ప్రభుత్వం 2007లో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు నేర్పరిచినా 2010 వరకూ బోర్డు ఛైర్మన్‌ను నియమించకుండా తాత్సారం చేసింది. ఆపై బోర్డు సభ్యుల నియామకానికీ కాలయాపన చేసింది.

ఇక ఈ బోర్డు రూపొందించిన నిబంధనల ప్రకారం పదిలక్షల రూపాయలు దాటి వ్యయమయ్యే ప్రతి ప్రభుత్వ, ప్రైవేటు నిర్మాణాల పైనా ఒక శాతం సెస్సును కార్మికుల సంక్షేమానికి వసూలు చేయాలని నిర్ణయించింది. ప్రైవేటు నిర్మాణాల యాజమాన్యాల నుండి సెస్‌వసూలు చేయటంలో ప్రభుత్వ అధికార యంత్రాంగంలో వ్యక్తమయ్యే లంచాలు, లొసుగులు, లోపాయికారీ విధానాలు ఒకభాగంకాగా, ప్రభుత్వ ఆధ్వర్యంలో సాగే నిర్మాణాలకు ఈ నిబంధన నుండి మినహాయింపు నివ్వాలని ఆయాకాంట్రాక్టర్లు వివిధ కోర్టులలో పిటిషన్లు దాఖలు చేసివున్నారు. అతిపెద్ద సంస్థలైన వైజాగ్ స్టీల్ ప్లాంట్, విటిపిఎస్, కెటిపిపి, జిఎంఆర్ వంటివి తాము చేపట్టే నిర్మాణాలు, విస్తరణ పనుల సందర్భంగా నిర్మాణ కార్మికుల సెస్సు విధింపు నుండి మినహాయింపు కోరుతూ హైకోర్టు నాశ్రయించాయి. మరికొన్ని సంస్థలు ఆయా నిర్మాణాలకయ్యేకూలీ మొత్తంపై మాత్రమే ఒక శాతం సెస్సు వసూలు చేయాలని, నిర్మాణపు విలువను బట్టి

(తరువాయి 7వ పేజీలో)

# వివిధ దేశాలలో ప్రజాఆందోళనలు

### చైనా విషవాయు రసాయన కార్మాగారానికి వ్యతిరేకంగా 12 వేలమంది ప్రజల నిరసన

చైనాలోని లియోనింగ్ రాష్ట్రం-ఈశాన్య నావికాకేంద్ర నగరమైన దలియాన్‌లో 12వేలమంది స్థానికంగా నివాసముండే ప్రజానీకం మునిసిపల్ ప్రభుత్వ పరిపాలనా కార్యాలయం ఎదుట నిరసన తెలియజేశారు. పారాక్సిలీన్ అనే విషపూరిత రసాయనాన్ని తయారుచేసే పెట్రో రసాయన కర్మాగారాన్ని వీరు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఈ ఆందోళనలో పాల్గొన్న వారిలో అత్యధికులు యువత, చదువుకున్నవారు, పట్టణ మధ్యతరగతికి చెందినవారు కావటంతోపాటుగా సాధారణ ప్రజానీకంకంటే ప్రభుత్వంవద్ద అధికంగా పలుకుబడి కలిగిన వారే కావటం విశేషం! ప్రభుత్వ అధికార యంత్రాంగం వీరి డిమాండ్‌కు తలొగ్గి రసాయన పరిశ్రమను పట్టణ పరిసరాలనుండి తొలగించి మరోచోట నిర్మించేందుకు అంగీకరించారు. ఈ విధంగా నిరసనకారుల డిమాండ్‌కు ప్రభుత్వ అధికారులు అప్పటికప్పుడు అంగీకరించటమనేది చైనాలో అరుదుగా చోటుచేసుకునేదే!

### ఇండోనేషియా జకార్తాలో అవమానకర వ్యాఖ్యలకు మహిళల నిరసన

ఇండొనేషియా రాజధాని జకార్తాలో-ప్రభుత్వ రవాణా వాహనంలో ప్రయాణిస్తున్న ఒక మహిళ- దాడికి, ఆపై అత్యాచారానికి గురైంది. దీనిపై జకార్తా గవర్నర్ ఫుజిబోవో, అత్యాచారానికి గురైన బాధితురాలి వేషధారణ గురించి వ్యాఖ్యానిస్తూ ప్రభుత్వ రవాణా వాహనాల్లో ప్రయాణించే మహిళలు స్కర్ట్స్ ధరించరాదన్నాడు. దీనిపై నిరసన వ్యక్తంచేస్తూ 2011 సెప్టెంబర్ 18న మహిళలు చేపట్టిన ఆందోళనలో 'మేము ఏవిధమైన దుస్తులు ధరించాలో చెప్పవద్దు-వారిని అత్యాచారాలు చేయవద్దని చెప్పండి' 'నా' 'మిని స్కర్ట్' 'నా హక్కు' అనే ప్లకార్డులను ప్రదర్శించారు, నినాదాలు చేశారు. గవర్నర్ తాను చేసిన వ్యాఖ్యలపై క్షమాపణలు చెప్పి తదనంతరం కూడా వీరు ఆందోళన కొనసాగించారు.

### ఫ్రాన్స్ విద్యార్థులు, ఉపాధ్యాయుల ఆందోళన

2011 దేశ ముసాయిదా బడ్జెట్‌లో 14వేల మంది విద్యారంగ నిపుణులను తొలగించటంతోపాటుగా విద్యారంగంలో తలపెట్టిన సంస్కరణల ప్రతిపాదనను నిరాకరించవలసిందిగా విజ్ఞప్తి చేస్తూ ఫ్రాన్స్‌లో 2011 సెప్టెంబర్ 27న విద్యార్థులు, ఉపాధ్యాయులు; విద్యార్థుల తల్లిదండ్రులతోకూడి దేశవ్యాపితంగా అతిపెద్ద నిరసన ధర్నాలను నిర్వహించారు. ఒకరోజు సమ్మె చేయటంతోపాటుగా ప్యారిస్ మొదలుకొని తేలోస్ వరకూ, గువాడే నుండి ఫ్రెంచ్‌గునియా వరకూ 100 నిరసన ధర్నాలను చేపట్టారు.

### యు.కె. ఫాసిస్టు వ్యతిరేక పోరాటం 75 సం॥ సందర్భంగా ప్రదర్శన

'బ్లాక్స్ షర్ట్స్'పై వీధి పోరాటాలలో గెలుపు సాధించి 75 సం॥రాలు నిండిన సందర్భాన్ని పురస్కరించుకొని 2-10-2011న ఆనాటి 'యుద్ధమండలమై'న తూర్పులండన్ నగరంలోని కేబుల్ స్ట్రీట్‌వరకు ఫాసిస్టు వ్యతిరేక ప్రచారకులు, ఫాసిస్టు వ్యతిరేకులు, వృద్ధులు 1000 మంది ప్రదర్శన, ధర్నాలను నిర్వహించారు. 75 సం॥ల క్రితం కమ్యూనిస్టు పార్టీ మరియు లండన్ కార్మికులు స్థానిక యూదు సొసైటీతో కలసి పోలీసుల వేషధారణలోని బ్లాక్‌షర్ట్స్‌ను, ఓస్వాల్డ్ ముస్సోలీయొక్క మూకలకు వ్యతిరేకంగా పోరాడారు. ఈ ప్రదర్శనలో స్థానిక యూదు ప్రతినిధులు మరియు బెంగాలీలు, కార్మికులతో కలగలిసి పాల్గొన్నారు. వీరు కార్మికోద్యమానికి ఒక పిలుపునిస్తూ 'ఫాసిస్టులను తుదముట్టించే ఉద్యమాన్ని నిర్మించాల'ని కోరారు. ఫాసిస్టు వ్యతిరేక ప్రదర్శనకారులు 'ఫాసిస్టులు ఉత్తీర్ణులు కారు...వారు ఉత్తీర్ణత సాధించలేరు' అనే నినాదాలు చేశారు.

### యుఎస్ఏ ఆఫ్ఘనిస్తాన్ దురాక్రమణ యుద్ధానికి నిరసనగా ధర్నా

ఆఫ్ఘనిస్తాన్‌పై దురాక్రమణ యుద్ధానికి 10 సం॥లు నిండిన సందర్భంగా యుద్ధ వ్యతిరేక కార్యకర్తలు అమెరికా వ్యాపితంగా ధర్నాలను నిర్వహించారు. వాషింగ్‌టన్‌లోని స్మిత్‌సోనియన్ మ్యూజియంలోకి ప్రవేశించటానికి 9-10-12న యుద్ధవ్యతిరేక ప్రదర్శనకారులు ప్రయత్నం చేయటంతోనే, వాయువులను నిరసనకారులపై వెదజిమ్మటంద్వారా పోలీసులు వారిని నిరోధించారు. ఇరాక్ మరియు ఆఫ్ఘనిస్తాన్‌లపై అమెరికా సాగించే అనైతిక, దురాక్రమణ యుద్ధాలకు ముగింపు పలకాలని వారు డిమాండ్ చేశారు.

### ఫ్రాన్స్ జి-20 దేశాల సదస్సును వ్యతిరేకిస్తూ ఆందోళన

స్పెయిన్, బెల్జియం, మెక్సికో, బ్రిటన్, ఫ్రాన్స్ మరియు ఇతర యూరోపు దేశాలనుండి 12వేల మంది పెట్టుబడిదారీ వ్యతిరేక నిరసనకారులు, జి-20 దేశాల సదస్సు జరుగుతున్న కేన్స్‌లో పెట్టుబడిదారీ వ్యతిరేక ధర్నాను చేపట్టారు. నైస్ ప్రాంతంలో ఒక 'సమాంతర సదస్సు'ను నిర్వహించారు. కేన్స్‌లోకి ప్రదర్శనకారులను రాకుండా నిరోధించేందుకుగానూ, జి-20 దేశాల సదస్సు ప్రాంగణంలో 12 వేల మంది పోలీసులను మోహరించి కేన్స్‌కు దారితీసే అన్ని రహదారులను పోలీసులు మూసివేశారు. 'సంపదను అందరికీ సమానంగా పంపిణీ చేయాలి' 'సంపన్న దేశాలు తమ సంక్షోభ భారాన్ని ప్రజలపై మోపేందుకు వారికెలాంటి హక్కు లేదు' అని పెట్టుబడిదారీ వ్యతిరేక ఆందోళనకారులు నినదించారు.

### లండన్ విశ్వవిద్యాలయ నిధులతో కోతలకు వ్యతిరేకంగా విద్యార్థుల ఆందోళన

9-11-2011న వేలాదిమంది విద్యార్థులు విశ్వవిద్యాలయ నిధులలో కోత విధించటాన్ని వ్యతిరేకిస్తూ లండన్ వీధులలో ప్రదర్శన నిర్వహించారు. 'అయితే'లు వద్దు! 'కానీ'లు వద్దు! విద్యారంగ కోతలు వద్దు!' అని వీరు నినదించారు. వీరు ట్రఫాల్గర్ స్క్వేర్‌నుండి ప్రదర్శన ప్రారంభించి లండన్ నగరంలో ముగించారు.

### జర్మనీ అణుధార్మికతను వెలువరించే న్యూక్లియర్ వ్యర్థాల ప్రవేశానికి ప్రజల నిరసన

23-11-11న న్యూక్లియర్ వ్యర్థాలతో కూడిన 11 కంటైనర్లతో రైలుబండి ఫ్రాన్స్‌నుండి 1200 కి॥మీ దూరం ప్రయాణించి డామెన్ చేరుకునేందుకు బయలుదేరింది. దీనిని జర్మనీ ప్రజలు నిరసించారు. నిరసనకారులు ఈ రైలుబండిని త్రోవలో అడుగడుగునా అడ్డుకునే ప్రయత్నం చేశారు. వేలాదిమంది ఆందోళనకారులు రైలుపట్టాలపై బైఠాయించారు. పుకిషిమా అణువిద్యుత్ కేంద్ర ప్రమాదంలో వెలువడిన అణుధార్మికత కంటే 44 రెట్ల తీవ్రతకల అణుధార్మిక వ్యర్థాలు ఈ రైలుబండి ద్వారా తమ దేశంలోకి వస్తున్నాయని, ఇది తీవ్ర ప్రమాదకరమని వారు హెచ్చరించారు. పోలీసులు నిరసనకారులను బలవంతంగా చెల్లాచెదురు చేశారు. పోలీసులతో జరిగిన ఘర్షణల్లో 150 మంది నిరసనకారులు గాయపడ్డారు.

### చిలీ విద్య ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విద్యార్థుల ఆందోళన

విద్య ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చిలీలో విద్యార్థి ఉద్యమం దావానలంలా వ్యాపిస్తున్నది. 2011 అక్టోబరు నుండి ఈనాటివరకు విద్యప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిరసన తెలియజేస్తున్నారు. లాటిన్ అమెరికావ్యాపితంగా విద్యార్థుల మద్దతుతో వీరి ఆందోళన ఊపందుకుంది. నాణ్యమైన విద్యను వీరు డిమాండ్ చేస్తున్నారు. విద్య ప్రైవేటీకరణను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. చిలీ విద్యార్థుల సమాఖ్య ఈ నిరసన పోరాటాన్ని నిర్వహిస్తున్నది. 'విద్యకోసం లాటిన్ అమెరికా కవాతు' అనే వీరి పిలుపుకు 27-11-11న పెద్దఎత్తున స్పందన వచ్చింది. లాటిన్ అమెరికాకు చెందిన అర్జెంటీనా, బ్రెజిల్, చిలీ, కొలంబియా, కోస్టారికా, ఈక్వడార్, గ్యాటిమాలా, హోండూరాస్, మెక్సికో, పెరుగ్వే, పెరు, ఉరుగ్వే, వెనిజులా దేశాల విద్యార్థులు తమ,తమ దేశాలలో పెద్దఎత్తున నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. 'విద్య ఒక ప్రాథమిక హక్కు'గా వారు డిమాండ్ చేస్తున్నారు. ఈ ఆందోళన ముగింపుగా 2011 డిసెంబర్ 21న చిలీ విద్యార్థులు 70 సెకండరీ పాఠశాలలను తమ అధీనంలోకి తెచ్చుకొని, వాటిని అదేవిధంగా కొనసాగిస్తున్నారు.

### ఇటలీ లింగ వివక్షకు వ్యతిరేకంగా రోమ్‌లో మహిళల ప్రదర్శన

రోమ్ నగరంలో 20వేల మంది మహిళా నిరసనకారులు-మరిన్ని హక్కులకోసం, వివక్షకు వ్యతిరేకంగానూ, ప్రస్తుత సంక్షోభానికి కారణంగా చెప్తున్న 'మాఛో' సంస్కృతిని నిందిస్తూ ప్రదర్శన నిర్వహించారు. ప్రజా ఆందోళనలనుండి ఫిబ్రవరిలో ప్రజానిరసన ప్రదర్శనల రూపం తీసుకున్నాయి. 'ది బాయ్ ఆంటిక్స్'కు పేరెన్నికగన్న ఆనాటి ఇటలీ ప్రధాని బెర్లూస్కోనీకి మహిళలు 'బాస్తా' చెప్పారు.

### జెరూసలెం లింగ వివక్షకు మహిళల నిరసన

1-1-12న నూతన సంవత్సర తొలిరోజున లింగపరమైన వివక్షలకు వ్యతిరేకంగా డజన్ల సంఖ్యలో కార్యకర్తలు, జెరూసలంలోని అతిఛాందసవాదులైన యూదులకు సేవలందించే బస్సులలో ప్రయాణించి-మహిళలు బస్సు వెనుక భాగంలోనే కూర్చోవాలనే అప్రకటిత నియమంపట్ల - నిరసన తెలియజేశారు. 10మంది చొప్పున నిరసనకారులు ఈ బస్సులను దొరకబుచ్చుకొని ముందు వరసలోని సీట్లలో కూర్చొని ప్రయాణించటంద్వారా తమ నిరసనను వ్యక్తంచేశారు.

### డర్బన్ వాతావరణ కాలుష్యాన్ని నిరసిస్తూ ఆందోళన:

వాతావరణ మార్పు సమస్యకు వ్యతిరేకంగా తక్షణ చర్యను డిమాండ్ చేస్తూ వేలాదిమంది నిరసనకారులు 2012 డిసెంబర్ 4న ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో వాతావరణ సమస్యలపై నిర్వహిస్తున్న సదస్సు ప్రాంగణం ఎదుట నిరసన వ్యక్తం చేశారు.

### చైనా భూమి వివాద పరిష్కారానికై వూకాన్ గ్రామ ప్రజల మిలిటెంట్ ఆందోళన

దక్షిణ చైనాలోని-గువాన్‌డాంగ్ రాష్ట్రం-వూకాన్ గ్రామంలో ఒక భూమి వివాద నేపథ్యంలో 20వేలమంది గ్రామస్థులు-స్థానిక గ్రామ ప్రభుత్వాన్ని, కమ్యూనిస్టు పార్టీ నాయకత్వాన్ని, పోలీసు బలగాలను తోసిపడేసి, మెరుపు దాడులు చేసి 14-12-11న గ్రామాన్ని తమ అధీనంలోకి తెచ్చుకున్నారు. ఆపై గ్రామస్థులు-తమ గ్రామానికి దారితీసే రోడ్లన్నింటిపై రాళ్ళను, చెట్లను పడవేసి రహదారులను దిగ్బంధించారు. అదేవిధంగా గ్రామం చుట్టూతా రక్షణ పోలీసులను మోహరించారు. తదనంతరం చైనా ప్రభుత్వ పోలీసులు గ్రామాన్ని చుట్టుముట్టారు. 14-12-11 నాటికి బయటనుండి ఏవిధమైన సరఫరాలు అందకుండా పదిరోజులపాటు వారు మనగలిగే అవకాశం వుంది.

### రష్యా పార్లమెంటు ఎన్నికలలో అవకతవకలకు వ్యతిరేకంగా ప్రజల నిరసనాందోళనలు

4-12-11న నిర్వహించిన పార్లమెంటు ఎన్నికలలో జరిగిన అవకతవకలను నిరసిస్తూ రష్యా దేశవ్యాపితంగా నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. ఎన్నికలలో ఓట్లు రిగ్గింగ్ జరిగిందని నిరసనకారులు ఆరోపిస్తూ వివాదాస్పద ఎన్నికను రద్దుచేయాలని, నమోదు చేయబడని పార్టీలన్నింటినీ నమోదు చేయాలని, రాజకీయ ఖైదీలనందరినీ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 10-12-11న క్రెమ్లిన్ వద్ద గత 20 సం॥లుగా చూడని లక్షమంది ప్రజలు పాల్గొన్న పెద్ద నిరసన ప్రదర్శన, ధర్నా నిర్వహించారు. నిరసనకారులు ప్రధాని పుతిన్‌కు వ్యతిరేకంగా 'పుతిన్ ఒక దొంగ' అని 'పుతిన్ లేని రష్యా' అనే నినాదాలనిచ్చారు, ప్లకార్డులు ప్రదర్శించారు. వందలాదిమంది నిరసనకారులను అరెస్టు చేయటంద్వారా, పోలీసు నిర్బంధంద్వారా ప్రభుత్వం నిరసనోద్యమాన్ని అణచివేయాలని ప్రయత్నిస్తున్నది. నిరసన ప్రదర్శనలకు అనుమతి నిరాకరిస్తున్నది. మాస్కోవద్ద ధర్నాలో పాల్గొన్న నేరానికిగానూ వామపక్ష విభాగ నాయకుడైన ఒలాలోత్సర్‌ను నిర్బంధించి 10 రోజులు జైలులో వుంచారు. జైలు నిబంధనలను సక్రమంగా పాటించని నేరానికిగానూ ఈజైలు శిక్షను మరో పదిరోజులపాటు పొడిగించారు. ఈ పొడిగింపు చర్యలు నిరసనకారుల ఆగ్రహాన్ని మరింతగా పెంపొందించాయి.

### సిరియా ప్రభుత్వ పోలీసు నిర్బంధానికి ప్రజల నిరసన

13-12-11న ప్రభుత్వ బలగాల దాడులను ఆపివేయాలని డిమాండ్‌చేస్తూ సిరియా వ్యాపితంగా ప్రజలు సాధారణ సమ్మె చేశారు. ఈ సమ్మె ప్రధానంగా దారొ, గాలి, హోబ్, హోమ్స్ పట్టణాల్లో నిర్వహించబడింది. బేకరీలు, మందుల షాపులు, కూరగాయల షాపులు అనే నిమిత్తం లేకుండా దేశవ్యాపితంగా దుకాణాలు, వ్యాపార సంస్థలు అన్నీ మూతపడ్డాయి. విదేశీ పత్రికా విలేఖరులను ప్రభుత్వం నిషేధించటంతో పాటుగా దేశీయ విలేఖరుల కదలికలను పరిమితం చేసింది.

### న్యూయార్క్ భారత ప్రధాని పర్యటన సందర్భంగా శిక్కు మతస్థుల నిరసన ప్రదర్శన

25-9-11న న్యూయార్క్ నగరంలో నివసించే వందలాదిమంది శిక్కు మతస్తులు ఒక నిరసన ప్రదర్శన నిర్వహించారు. వీరు 1984 శిక్కు వ్యతిరేక దాడుల సందర్భంగా శిక్కుల ఊచకోతలో దుర్మార్గమైన పాత్ర పోషించిన భారత పట్టణాభివృద్ధిశాఖామంత్రి కమల్‌నాథ్‌ను కేంద్ర మంత్రిమండలినుండి తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమాలు ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యాలయాల ఎదురుగా-అక్కడ జరగనున్న భారత ప్రధాని మన్మోహన్‌సింగ్ ప్రసంగ ప్రారంభానికి ముందుగా జరిగాయి. ఈ నిరసన ధర్నాను 'జస్టిస్ ఫర్ సిఖ్స్ గ్రూప్' అనే సంస్థ చేపట్టి నిర్వహించింది.

N

---

**విదేశీ, ...** (6వ పేజీనుండి)

సెస్సు వసూలు చేయరాదని ఎగ్గొట్టే వేషాలు ఎన్నో వేశాయి. మొత్తంగా నిర్మాణాల సందర్భంగా వసూలుచేసే ఈ సెస్సును సవాలు చేస్తూ హైకోర్టులో 300కు పైగా పిటిషన్లు దాఖలు కాగా, కేంద్ర ప్రభుత్వ దక్షిణ మధ్య రైల్వే విభాగ కాంట్రాక్టర్లే 69 పిటిషన్లను దాఖలు చేయటం, ఈ చట్టం అమలు దశలోనే మరింతగా నీరుగార్చే ప్రభుత్వ స్వభావాన్ని స్పష్టం చేస్తున్నది.

ఈ చట్టం అమలు తీరు ఇంతటి 'సుందరముద నష్టంగా'వున్నప్పటికీ సెస్‌ల రూపేణా, భవన నిర్మాణ కార్మికులుగా గుర్తింపు కార్డుల జారీకోసం చెల్లించబడిన నమోదురుసుం ద్వారానూ; ప్రతి సం॥రం ప్రతి ఒక్క సభ్యునినుండీ రెన్యువల్ సందర్భంగా జమయ్యే రుసుం ద్వారానూ; పెన్షన్ సౌకర్యం పొందేందుకు ముందస్తుగా ప్రతి కార్మికుడూ ప్రతిఏటా చెల్లించే కిస్తీలు...వంటి వాటన్నింటి ద్వారానూ బోర్డువద్ద 650 కోట్లకు పైగానే డబ్బు పోగుబడింది. (ఇంకా ప్రభుత్వ నిర్మాణాలపై బోర్డుకు చెల్లించాల్సిన సెస్సు కనీసం రెండువేల కోట్ల రూపాయలపైగా వుంటుందని అంచనా! ఇవికాక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ మొత్తానికి జమచేయవలసిన మ్యాచింగ్ గ్రాంటుల సంగతి సరేసరి!)

'కార్మిక సంక్షేమ బోర్డు' తన వద్ద జమైన మొత్తంపై లభించే వడ్డీలో కొద్ది భాగాన్ని మాత్రమే భవననిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం విదిలిస్తూ వాస్తవ అర్థంలో కనీసపాటి కార్మికుల సంక్షేమాన్నికూడా గాలికొదిలేసింది. (ఇప్పటికీ రాష్ట్రంలోని భవన నిర్మాణ కార్మికులందరికీ గుర్తింపుకార్డులే సక్రమంగా అందజేయకపోవటాన్ని గమనించాలి)

మరోవైపున ప్రపంచబ్యాంకు ఆదేశిత విధానాల ననుసరించి వివిధ శాఖల పద్దులలోని డబ్బును ప్రభుత్వ కోశాగారానికి తరలించటమనే ప్రక్రియను ప్రభుత్వం చేపట్టి కొనసాగిస్తున్నది. ఈ నిధులను ప్రభుత్వం స్వతంత్రసంస్థలనబడేవానికి అప్పగించటం ద్వారా విదేశీ స్వదేశీ పెట్టుబడిదారులకు ద్రవ్యవనరుగా అందజేస్తున్నది. గతంలో ఈలాంటి సంస్థలకున్న నిల్వలను ప్రభుత్వ కోశాగారానికి తరలించినా, వివిధ రూపాల్లో ప్రజాసంక్షేమ పథకాలకో లేదా ప్రభుత్వ నిర్మాణాలలోనో ఆ డబ్బు వినియోగమయ్యేది. కానీ ఈనాడు ప్రజలనుండి వివిధ రూపాల్లో కూడబెట్టుకున్న ఆ నిల్వలన్నింటినీ సామ్రాజ్యవాద గుత్తసంస్థలే నియంత్రిస్తున్నాయి. బీమారంగంలో నిల్వలను, ప్రభుత్వోద్యోగుల ఫించను నిల్వలను, భవిష్యనిధులను విదేశీ బడా సంస్థలు కైంకర్యం చేయటానికి పాలకులు ఇప్పటికే ఆమోదం తెల్పి ఉన్నారు. అదే బాటలో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ నిధినీ తరలించే ప్రయత్నాలను ప్రభుత్వం వేగిర పర్చింది. సామాజిక సంక్షేమం ప్రభుత్వాల బాధ్యత కాబోదన్న ప్రపంచబ్యాంకు ఆదేశాన్నిశిరసావహిస్తున్న; విదేశీ, స్వదేశీ బడాపెట్టుబడిదారుల ప్రయోజనాలకే అంకితమైన పాలకుల కళ్ళు తెరుచుకోవాలంటే సంఘటిత పోరాటాలే కార్మికుల ముందున్న కర్తవ్యం. N

---

**కాకినాడ ...** (చివరి పేజీనుండి)

కోల్పోతే తిరిగి పొందటం కష్టసాధ్యమని గుర్తించి, ఇప్పటికీ భూములు అమ్ముకోకుండా కష్టనష్టాలకోర్చి చైతన్యయుతంగా అనేకమంది నిలబడ్డారంటూ, వారందరికీ అభినందనలు తెలిపారు. నయాన్నో భయాన్నో కొందరు అమ్ముకోవాల్సి వచ్చినప్పటికీ తమ భూములు తిరిగి తమకే చెందాలని ప్రజలు నిలబడటం, ఆందోళన చేయటం ఆహ్వానించదగిన విషయమని, పోరాడే ప్రజలపక్షాన రైతుకూలీసంఘం (ఆం.ప్ర) నిలబడుతుందని, సెజ్ ప్రాంతంలో ప్రజలపై పెట్టిన కేసులన్నింటినీ రద్దు చేయాలనీ, చందక సూర్యనారాయణను వెంటనే విడుదల చేయాలని రైతుకూలీసంఘం రాష్ట్రబృంద సభ్యులు డిమాండ్ చేశారు. N

# పాలకుల, పాలకవర్గాల ప్రజా,కార్మిక వ్యతిరేక విధానాలపై ఒక్కటై సమర శంఖం పూరించండి!!

**నాగరికత** ఎరుగని కాలంలో, దేశాల ఎల్లలే లేని ప్రపంచంలో, జనగణాలు పొట్టచేత బట్టుకొని భరత భూమికి చేరుకొన్నాయని చరిత్రను పేర్చుతున్న శకలాలు, చారిత్రక కథనాలు వెల్లడించుతుంటే; ఆంగ్లేయ వలసాధిపతులు భరత భూమి బిడ్డలను, కష్టజీవులను, కట్టుబానిసలుగా మార్చి, కడలి దాటించి, ఎక్కడెక్కడికో తరలించి, అమ్ముకొని సంపదలు చేసుకొన్నారన్న సత్యాలను, మన తక్షణ పూర్వీకుల కథనాలు మనకు వెల్లడిస్తున్నాయి.

దేశాలు స్వాతంత్ర్యం సాధించుకొని, స్వతంత్రాభివృద్ధి మార్గంలో సాగి, ప్రగతి ఫలాలను ప్రజలకందించాల్సిన ఈ కాలంలో, దేశాల సముదాయంలో అంతకంతకూ ఎదిగి ఉన్నత స్థానాన్ని పొందాల్సిన ఈ కాలంలో, 65 సంవత్సరాలుగా స్వాతంత్ర్యం కొనసాగుతోందని చెప్పబడే మన దేశం యొక్క, మన దేశంలోని ప్రజల యొక్క పరిస్థితి ఏమిటి?

**సంపదల పంపిణీ, వినియోగానికి సంబంధించి,**
**ప్రజల ఆయురారోగ్యాలకు సంబంధించి,**
**విద్యా, విజ్ఞానాలను అందించే అవకాశాలకు సంబంధించి,**
**సాంకేతికాభివృద్ధి, వినియోగాలకు సంబంధించి,**
**మానవశక్తుల వినియోగం, అభివృద్ధిలకు సంబంధించి,**
**ప్రతి మనిషికీ పని, పౌష్టికాహారంలకు సంబంధించిన స్థాయిల్లో,**

మనదేశం అట్టడుగు స్థానాలలో వ్రేలాడుతూవుంది. మన ప్రజాసముదాయాలలో 75శాతం పైగా ప్రజలు కడుపు నిండా తినడానికి తిండిలేని, చాలినంత బట్టకట్టుకోలేని, తలదాచుకోవటానికి గూడులేని దారుణాతిదారుణమైన పరిస్థితుల్లో జీవనం సాగిస్తున్నారు. మనదేశపు పాలకుల, ప్రభుత్వాల, ప్రణాళికా సంఘాల యొక్క గణాంకాలే ఈ వాస్తవాలను తేటతెల్లం చేస్తున్నాయి.

దేశ సంపదను సృష్టించే కార్మిక, శ్రామిక వర్గాలను మరింతగా దోచుకొనే, మరింతగా బికారులుగా మార్చే ప్రక్రియను పాలకులు, ప్రభుత్వాలు ముమ్మరం చేస్తున్నాయి.తమ జీవన్మరణ పోరాటాల ద్వారా కార్మికవర్గం సాధించుకొన్న హక్కులను, సౌకర్యాలనూ రద్దు చేస్తూ, కార్మిక వర్గాన్ని నికృష్టంగా, నిర్దయగా దోచుకొంటూ, కార్మిక- శ్రామిక జనుల జీవితాలను కొల్లగొట్టటం అన్నది ఒక విధానంగా అమలు జరుగుతూ ఉంది. కార్మిక చట్టాలను అమలు చేయకపోవటం, సంస్కరించటం, పనిగంటలపెంపు, పనిభారం పెంపు, పని ప్రదేశాల్లో భద్రతా చర్యల కుదింపు, పరిహారపు చెల్లింపులరద్దు లేదా కుదింపు, కార్మికులు పొదుపు చేసుకొన్న మొత్తాలను ప్రభుత్వ నియంత్రణ నుండి తప్పించి, జూదపు క్రీడను సాగించుతున్న మార్కెట్ శక్తులకు స్వాధీనం చెయ్యటం, మహిళా కార్మికులను రాత్రీ పగలూ అన్నది లేకుండా పనిచేయించటానికి, వారి శ్రమశక్తిని యధేచ్చగా దోచుకోవటానకీ, లేఆఫ్-క్లోజర్లను పెట్టుబడిదారీ పారిశ్రామిక వేత్తలు తమ యిష్టాను రాజ్యంగా జరపటానికి వీలుగా ఫ్యాక్టరీ చట్టాన్నీ, పారిశ్రామిక వివాదాల చట్టాన్నీ, కనీస వేతన చట్టాలను, పెన్షన్ -పి.ఎఫ్ చట్టాలను మార్చివేసే ప్రయత్నాలనూ, ప్రక్రియనూ పాలకవర్గాలు, ప్రభుత్వాలూ కొన సాగిస్తున్నాయి.

పాలకులు, ప్రభుత్వాలూ చేపట్టి, అవలంభించిన విధానాల ఫలితంగా సాంప్రదాయక రంగాలైన చేనేతవస్త్రాలు, జనపనార, తోటల పెంపకం వంటి రంగాలు సంక్షోభంలోకి నెట్టబడి, ఆయా రంగాలలోని ఉపాధి అవకాశాలు పూర్తిగా సన్నగిల్లి గ్రామీణ పేదల జీవితాలు అల్లకల్లోలమై ఛిద్రమయ్యాయి.

దేశంలోని ప్రధాన జీవనాధారమైన వ్యవసాయక రంగం సంక్షోభానికి గురిచేయబడింది. గిట్టుబాటు ధర లభించక, వ్యవసాయం గిట్టుబాటుగాక రైతులు, వ్యవసాయదారులు ఆత్మహత్యల బారినపడటం రోజువారీ ప్రక్రియగా మారిపోయింది..

దేశమంతటా పేదరికం అలముకొంది. రోజురోజుకీ అనూహ్యంగా పెరుగుతున్న నిత్యావసర వస్తువుల, కూరగాయల ధరలు, మూలిగే నక్కపై తాటిపండు పడ్డట్టు, ప్రజలను మరింతగా కృంగదీస్తున్నాయి.

ఒక్కమాటలో చెప్పుకోవాలంటే ఈ రోజున దేశం, దేశ ప్రజల జీవితాలు దోపిడీ మార్కెట్టు శక్తుల వశం చేయబడ్డాయి. ఎవరో, ఏ గుత్త, బహుళజాతి సంస్థలో దేశంపై పెత్తనం చెలాయించుతూ వుంటే, ప్రజల జీవితాలు పరాధీనం అయిపోయాయి.

**ఈ పరిస్థితి యిలాగే కొనసాగనీయటమా? దేశ ప్రజల బ్రతుకులను మరింతగా బండలపాలు చేయ నీయటమా? అన్నవే భారత కార్మికవర్గం ముందున్న ప్రశ్నలు! దేశ ప్రజల జీవితాలను మెరుగుపరచని, దేశ కార్మికవర్గ జీవన పని పరిస్థితులను నిరంతరం అధోగతికి త్రోసివేసే ఈ పరిస్థితులను కొనసాగనీయరాదన్నదే కార్మికుల జవాబు.**

పాలకుల, ప్రభుత్వాల ఈ ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను భారత కార్మికవర్గం వ్యతిరేకిస్తుంది, నిరశిస్తోంది. ఈ విషయాన్ని ముక్తకంఠంతో తెలియ చెప్పటానికి తలపెట్టినదే ఫిబ్రవరి 28 నాటి సార్వత్రిక సమ్మె.

కార్మికవర్గం యొక్క ఈ నిరసన కేవలం ఒక నినాదంగానూ, ఒక ఆనవాయితీ మొక్కుబడి కార్యక్రమంగానూ కాక, ఒక స్ఫూర్తిదాయకమైన కార్మికనిరసనగా సాగించాలి. ఫిబ్రవరి 28న ఈ సార్వత్రిక సమ్మెను జయప్రదం చేసి, కార్మికులందరూ పాలకులు, ప్రభుత్వాల విధానాల పట్ల తమకుగల వ్యతిరేకతను ఎలుగెత్తి చాటాలి!

- **నమోదైన కార్మిక హక్కులన్నింటిని కాపాడాలి. కార్మిక చట్టాలను అమలు చేయాలి.**
- **రోజురోజుకూ పెరుగుతున్న ధరలను అరికట్టాలి. భవిష్య వాణిజ్యాన్ని రద్దు చేయాలి.**
- **అసంఘటితరంగ కార్మికులకు ఉద్యోగభద్రత, సామాజిక భద్రత, కార్మిక హక్కులరక్షణ కల్పించాలి.**
- **స్త్రీ కార్మికులకు పురుషులతో సమానంగా వేతనాలు, భత్యాలూ, సదుపాయాలూ కల్పించాలి.**
- **ప్రభుత్వరంగ యూనిట్ల పెట్టుబడుల ఉపసంహరణ నిలిపివేయాలి. ప్రైవేటీకరించటాన్ని, ఆశ్రితులకు అప్పనంగా కట్టపెట్టటాన్ని నిలిపివేయాలి.**
- **అందరికీ పెన్షను హామీ ఇవ్వాలి.**
- **సంపన్నులు, బడా పెట్టుబడిదారులు ఎగగొట్టిన బ్యాంకు అప్పులను, ఎగగొట్టిన పన్ను బకాయిలనూ వెంటనే వసూలు చేయాలి.**
- **ముడిఖనిజాలు, యితర పదార్థాల ఎగుమతులను నిషేధించాలి.**
- **రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి.**
- **గ్రామీణ పేదలకు ఏడాదికి 300 రోజుల పని కల్పించాలి. రోజుకు 200రూ॥ల వేతనాన్ని ఖరారు చేయాలి.**
- **గ్రామీణ, పట్టణ ప్రాంతాల వృత్తిదారులందరకూ వృత్తిరక్షణ, జీవన గ్యారంటీ కల్పించాలి.**

**N**

# కాకినాడ సెజ్ ప్రాంతంలో రైతుకూలీసంఘం (ఆం.ప్ర) రాష్ట్రబృందం పర్యటన

**యు.కొత్తపల్లి,** తొండంగి మండలాల్లో జీవన మనుగడకోసం, తమ భూములపై హక్కుకోసం పోరాడుతున్న ప్రజలపై పెట్టుబడిదారుల గూండాల, పోలీసుల- దాడులు, దౌర్జన్యాలను ఖండిస్తూ, పోలీసులు అరెస్ట్ చేసిన చందక సూర్యనారాయణను బేషరతుగా విడుదల చేయాలని; విద్యార్థులు, నాయకులపై బనాయించిన కేసులన్నింటినీ రద్దు చేయాలని ఎ.ఐ.కె.ఎమ్.కె.ఎస్. అనుబంధ రైతుకూలీ సంఘ రాష్ట్ర బృందం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది.

రైతుకూలీసంఘం (ఆం.ప్ర) రాష్ట్ర కార్యదర్శి కా॥ కె. కోటయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కా॥ ఎమ్.ఎస్. నాగరాజు, కా॥ వనచర్ల సుబ్బారావులతో కూడిన బృందం ఫిబ్రవరి 14, 15 తేదీలలో యు. కొత్తపల్లి, తొండంగి మండలాలలో పర్యటించింది. సెజ్‌ల పేరుతో భూముల గుంజివేతకు పెట్టుబడిదారులు, పోలీసులు సాగిస్తున్న దాడులు-దౌర్జన్యాలకు గురైన బాధితులతో బృంద సభ్యులు మాట్లాడారు. వారి ఆందోళనకు సంఘీభావం ప్రకటించారు.

6-2-2012న తొండంగి మండలం చోడిపల్లివారి పేటలో పోలీసుల దాడులకు బెదరకుండా ప్రజలు ఎస్.ఐ.ని నిలదీసినందుకుగాను 36 మంది కళాశాల విద్యార్థులతోసహా 80 మందికిపైగా ప్రజలపైన పోలీసులు అక్రమకేసులు బనాయించారు. హత్యాయత్నం నేరం మోపారు. సెజ్ వ్యతిరేక కమిటి సభ్యుడు చందక సూర్యనారాయణను నిర్బంధించి జైల్లో పెట్టారు. ప్రజల్ని భయభ్రాంతుల్ని చేసి భూములనుండి, ఇళ్ళ నుండి గెంటివేయటానికి పోలీసులు, పెట్టుబడిదారులు ప్రయత్నిస్తున్నారు. ఏమైనా, ప్రజలు మొక్కవోని ధైర్యంతో, ప్రభుత్వం గుంజివేయబూనుకుంటున్న తమ పొలాలలోనే గుడారాలు వేసుకొని, అక్కడే వండుకొని తింటూ, తమ నిరసన కార్యక్రమాల్ని కొనసాగిస్తున్నారు.

ఈ సమస్య పూర్వాపరాల్ని పరిశీలిస్తే, 2005 సెప్టెంబరులోనే ఒ.యన్.జి.సి. రిఫైనరీ కోసం కాకినాడ రూరల్, పిఠాపురం, సామర్లకోట మండలాల్లో 9,126 ఎకరాలు; 2005 డిసెంబరులో కాకినాడ పోర్టు సమీపంలో 1,000 ఎకరాలు కావాలని ఆనాటి ముఖ్యమంత్రితో ఒప్పందం కుదుర్చుకుంది. 2006 నవంబర్‌లో ఓ.ఎన్.జి.సి. ఈ ఒప్పందాన్ని విరమించుకొన్నట్లు ప్రకటించింది. తద్వారా ఆ ఒప్పందం రద్దయింది.

తదుపరి కాకినాడ ఎస్.ఇ.జడ్. ప్రయివేట్ లిమిటెడ్ పేరిట రమణక్కపేట, ఎ.వి.నగరం పంచాయితీలలో 2587 ఎకరాల భూసేకరణ చేసేందుకు 2007 ఏప్రిల్‌లో నోటిఫికేషన్ జారీచేసి అనుమతి ఇచ్చింది. కేంద్ర ప్రభుత్వం అనుమతి పొందిన అనంతరం అధికారులు భూసేకరణకు పూనుకోలేదు. 2010 ఏప్రిల్ నాటికి భూసేకరణ కాలపరిమితి దాటిపోయి కాకినాడ ఎస్.ఇ.జడ్. ప్రయివేట్ లిమిటెడ్‌కు ఇచ్చిన అనుమతులు కూడా రద్దయిపోయాయి.

అయితే జిల్లా రెవిన్యూ అధికారులు కాకినాడ ఎస్.ఇ.జడ్.కొరకు పెరుమాళ్ళపురం, పొన్నాడ, కోదాడ, మూలపేట, శ్రీరామపురం గ్రామ పంచాయతీలలో గల భూముల సేకరణకై అనుమతించాలని కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు ఏవిధమైన అనుమతులూ ఇవ్వలేదు. కనుక ఆ రూపంలోనూ భూములను సేకరించే అధికారం రెవిన్యూ అధికారులకు లేదు. కాకినాడ ఎస్.ఇ.జడ్. ప్రయివేట్ లిమిటెడ్ కొరకు చట్టవిరుద్ధంగా భూసేకరణ చేయటాన్ని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తప్పుపట్టింది. ఆ చర్యలను ఆపాలని 2008 డిసెంబరులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. అయితే ఈ ఆదేశాలను కూడా ధిక్కరిస్తూ రైతులను భూముల నుంచి తొలగించేందుకు పెట్టుబడిదారుల పనుపున పోలీసులు వ్యవహరిస్తున్నారు.

1995 సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కలెక్టర్ నోటిఫికేషన్లు జారీచేసిన తర్వాత భూములను ఎవరూ అమ్మకూడదు, కొనకూడదు. ఇందుకు వ్యతిరేకంగా కాకినాడ సెజ్ ప్రయివేట్‌లిమిటెడ్ డెవలపర్ పేరుతో కర్నాటి వెంకటేశ్వరరావు (కె.వి.ఆర్) యు. కొత్తపల్లి మండలంలో 2,295 ఎకరాలు, తొండంగి మండలంలో 2,398 ఎకరాలు తన పేరుమీద కొనుగోలు చేశాడు. కె.వి.ఆర్. వత్తాసుదార్లు, అధికారులు, బ్రోకర్లు, పెత్తందార్లు ప్రజలను బెదిరించి, భయపెట్టి భూములను కొన్నారు. ప్రభుత్వం అప్పటికే జిరాయితీ భూములకు లక్షా ఇరవై వేలనుంచి లక్షా యాభై వేల మధ్య; అసైన్డ్, బంజరు, పోరంబోకు, పుంతలు తదితర సాగు భూములకు యనభై వేల రూపాయలు ఇస్తున్నట్లు ప్రకటించింది. ప్రభుత్వం అయితే ఇంత తక్కువ ధర చెల్లిస్తుంది, లేదంటే బ్యాంకుల్లో డబ్బులు కట్టి భూములు జప్తుచేస్తుందని – అదే కె.వి.ఆర్. అయితే మూడు లక్షల రూపాయలు చెల్లిస్తాడని ప్రచారం చేసి – ప్రజల్లో అభద్రత నెలకొల్పి కొన్ని భూముల్ని బలవంతంగా గుంజుకొన్నారు. పెద్ద రైతులకు, పెత్తందార్లకు, రాజకీయ నాయకులకు పత్రాలు, రికార్డులు లేకున్నా ఏడు నుంచి పది, పన్నెండు లక్షలు చెల్లించారు. రైతు కూలీ సంఘం (ఆం.ప్ర) అనుబంధంగా ఉన్న వాకతిప్ప దళిత వ్యవసాయ రైతుకూలీసంఘం (సొసైటి) ఐదు సం॥లపాటు ఆందోళన సాగించి, కోర్టులలో కేసులు నడిపి జిరాయితీ భూముల వలె – అసైన్డ్ భూములు, పేదల సాగులో ఉన్న భూములన్నింటికి మూడు లక్షల రూపాయలు ఇవ్వాలని ఆర్డర్ పొందింది. అయినప్పటికీ ఎకరాకు రెండు లక్షల అరవై వేల రూపాయలే చెల్లించారు. ఇంకా ఎకరాకు నలభైవేలు ఇవ్వవలసివుంది.

కె.వి. రావు తాను కొన్న 4,693 ఎకరాలు వంశపారంపర్యంగా తన కుటుంబీకులు అనుభవించే విధంగా దస్తావేజులు వ్రాయించుకొన్నాడు. నిబంధనలకు వ్యతిరేకంగా ఈ రిజిస్ట్రేషన్లకు ఫీజులు మినహాయింపు పొందాడు. ఒక్కపైసా కూడా రిజిస్ట్రేషన్ ఛార్జి చెల్లించలేదు. అయితే కాకినాడ సెజ్ వేరు; కాకినాడ సెజ్ ప్రయివేట్ లిమిటెడ్ వేరు. ఈ భూములన్నింటినీ కె.వి.రావు వ్యక్తిగతంగా కొనుగోలు చేశాడు. కనుక భూసంస్కరణల చట్టం – 1973 ప్రకారం సీలింగ్ మిగులు భూములుగా ప్రభుత్వం స్వాధీనం చేసుకొని ప్రజలకు తిరిగి పంపకం చేయాలి. లేదా ఇప్పటికీ రైతుల సాగులోనే ఉన్నాయి కనుక రైతులకు తప్ప, ప్రభుత్వానికిగానీ కొనుగోలుచేసిన వారికిగానీ ఏవిధమైన హక్కూ లేదు.

ఈ విధంగా ప్రజల సహజ సంపదలను కొల్లగొట్టి, వేల లక్షల కోట్లను కూడబెట్టిన దోపిడిదారులు, పెట్టుబడిదారులు, పోలీసులు, వారికి వత్తాసుగా రెవిన్యూ యంత్రాంగం తాము రూపొందించిన అన్ని చట్టాలను తుంగలో త్రొక్కి ప్రజల్ని తమ ఆవాసాల నుండి, భూముల నుండి వెళ్లగొట్టే కుట్రలు చేస్తున్నారు, కుయుక్తులు పన్నుతున్నారు. క్రూరంగా, ఘోరంగా, నీచంగా ప్రజలపై అణచివేత, నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నారు. ఇప్పుడు జి.ఎం.ఆర్. కంపెనీకోసం పనిచేస్తున్నారు. ప్రజలపై తెగబడుతున్నారు. తమ భూములకోసం, జీవన మనుగడ కోసం ప్రజలు చైతన్యవంతమౌతున్నారు. ఒ.ఎస్.జి.సి. తర్వాత కె.వి.రావు, మరలా కె.వి.రావు నుండి ప్రస్తుతం జి.ఎం.ఆర్.... ఇలా రకరకాల పేర్లతో ప్రజల్ని వంచించడాన్ని రైతులు, ప్రజలు సహించలేక పోయారు. 2009లో కె.వి. రావు తన దగ్గర భూములున్నట్లు, ఎకరం ముప్ఫయి లక్షల రూపాయలకు అమ్ముతున్నట్లు ప్రకటించినప్పటి నుంచి, ప్రజలు తమ నిరసనలను తీవ్రంచేశారు. రాష్ట్రంలో దేశంలో అన్నిచోట్ల ఇట్లాంటి మోసాలకు పాలకపక్షాలు కుట్రలు చేస్తున్నాయని గమనిస్తున్నారు. ప్రజలకు కనీసపాటి సౌకర్యాలుండవని, ఉద్యోగాల కల్పన అబద్ధమని గ్రహించారు.

ప్రస్తుతం జి.ఎం.ఆర్. పేరుతో భూములు స్వాధీన పరుచుకోవడానికి, పచ్చని పంటపొలాల్ని నాశనం చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. తమ భూములు అప్పగించబోమని తిరగబడుతున్నారు. మంత్రులను అడ్డగిస్తున్నారు. ప్రజలను బెదిరించడానికి వస్తున్న పోలీసులను నిలదీస్తున్నారు. నిరసనాందోళనలను తీవ్రంచేస్తున్నారు.

రైతుకూలీసంఘం (ఆం.ప్ర) 2009 డిసెంబర్‌లో కాకినాడ సెజ్ బాధిత ప్రాంతాలలో పర్యటించింది. 2011 అక్టోబర్ 23న భారత జనాందోళన ఛైర్మన్ డా॥ బి.డి.శర్మ; విశ్రాంత ఆచార్యులు, వ్యవసాయార్థికవేత్త ప్రొఫెసర్ కె.ఆర్. చౌదరిలతో కూడి రైతుకూలీసంఘం అధ్యక్ష కార్యదర్శులు ఈ ప్రాంతంలో పర్యటించి ప్రజల ఆందోళనకు సంఘీభావం తెలిపారు. ఫిబ్రవరి 14, 15 తేదీల్లో ఈ ప్రాంతాలలో పర్యటించిన రైతు కూలీసంఘం (ఆం.ప్ర) రాష్ట్ర బృంద సభ్యులు మాట్లాడుతూ న్యాయమైన ప్రజల పోరాటాన్ని బలపరుస్తున్నామని, సామ్రాజ్యవాద భూస్వామ్య అనుకూల ప్రభుత్వాలు, పాలకపక్షాలు ప్రజలను మభ్యపెట్టి, భయపెట్టి, బెదిరించి భూములనుండి వెళ్లగొడుతున్నాయని, ఒకసారి భూమిని

**(తరువాయి 7వ పేజీలో)**

Printed, Published and Owned by P. Jaswantha Rao 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010
and Printed at Chaitanya Printers, Gora Veedhi, Suryaraopet Vijayawada-2
Editor: P. Jaswantha Rao, 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010